ప్రతిపక్షం

www.prathipaksham.in

ఆదివారం 18.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 298 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



టీమ్ఇండియా థ్రిల్లింగ్ విక్టరీ.. 10

మహిళలకు 50 శాతం



మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు

హైదరాబాద్ మేయర్ పీఠం మహిళకు

- కార్పొరేషన్లలో రిజర్వేషన్లు ఒకటి ఎస్సీ, ఒకటి ఎస్టీ, 3 బీసీలు
- 121 మున్సిపాలిటీల్లో 5 ఎస్టీ, 17 ఎస్సీ, 38 బీసీలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఈ మేరకు మునిపల్ శాఖ డైరెక్టర్ శ్రీదేవి శనివారం ఖరాయిన రిజర్వేషన్ల జాబితాను విడుదల చేశారు. వీటిలో 50 శాతం కార్పొరేషన్లను మహిళలకు రిజర్వేషన్ చేసినట్లు వెల్లడించారు. మొదట ఎస్టీ, ఎస్సీ రిజర్వేషన్లు ఖరారు చేశామని ,లాటరీ ద్వారా 50శాతం మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని వివరించారు. రాష్ట్రంలోని పది కార్పొరేషన్ల రిజర్వేషన్లు ఖరారు ఈ విధంగా ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ ఒకటి చొప్పున, బీసీ మహిళలకు మూడు మేయర్ పోస్టులకు రిజర్వేషన్ కల్పించామన్నారు. మరో 5 జనరల్‌కు కేటాయించామని చెప్పారు. కొత్తగూడెం కార్పొరేషన్ (ఎస్టీ జనరల్) రామగుండం కార్పొరేషన్ (ఎస్సీ జనరల్) , మహబూబ్ నగర్ కార్పొరేషన్ (బీసీ మహిళ), మంచిర్యాల, కరీంనగర్ కార్పొరేషన్ (బీసీ జనరల్) వరంగల్ కార్పొరేషన్ (జనరల్), ఖమ్మం, నిజామాబాద్, గ్రేటర్ హైదరాబాద్ (మహిళా జనరల్) కు కేటాయించామని వివరించారు. వరంగల్ కార్పొరేషన్‌ను అన్ రిజర్వుడ్‌గా ఉంచారు. రాష్ట్రంలోని 121 మున్సిపాలిటీలల్లో చైర్మన్లుగా ఎస్టీలకు 5, ఎస్సీలకు 15, బీసీలకు 38(31.4%), బీసీ మహిళలకు 19 రిజర్వేషన్లు ఖరాయయ్యాని వివరించారు. మిగతా చోట్ల జనరల్‌కు కేటాయించామని వివరించారు.

కార్పొరేషన్లకు రిజర్వేషన్లు

1. జీహెచ్ఎంసీ	మహిళ (జనరల్)
2. నల్లగొండ	మహిళ (జనరల్)
3. మహబూబ్‌నగర్	మహిళ (బీసీ)
4. జీడబ్ల్యూఎంసీ	అన్ రిజర్వ్‌డ్
5. కరీంనగర్	బీసీ (జనరల్)
6. ఖమ్మం	మహిళ (జనరల్)
7. నిజామాబాద్	మహిళ (జనరల్)
8. మంచిర్యాల	బీసీ (జనరల్)
9. కొత్తగూడెం	ఎస్టీ (జనరల్)
10. రామగుండం	ఎస్సీ (జనరల్)

...:: మిగతా 2లో



పేదరికం.. నిరక్షరాస్యత నా శత్రువులు

ఎన్నికలప్పుడే రాజకీయాలు..

తర్వాత జనం కోసమే పనిచేస్తా

> ప్రాజెక్టులకు అనుమతులు, నిధులు తెచ్చేందుకే ప్రధాని మోదీని కలుస్తున్నా. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేస్తాం. తర్వాత ప్రజల కోసం కలిసి పనిచేస్తాం. నాకు ఎవరూ శత్రువులు లేరు. రాజకీయ ప్రత్యర్థులను ఎన్నికల్లోనే ఓడించాను. ఎన్నికల తర్వాత నాకు ఎవరి మీద కోపం లేదు, శత్రుత్వం లేదు. పేదరికం, నిరక్ష్యరాస్యత మాత్రమే మనకు శత్రువులుగా భావిస్తా.
>
> -రేవంత్ రెడ్డి, సీఎం

- నిధులు, అభివృద్ధి కోసమే మోడీని కలిశా
- నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టును గతంలో నిర్లక్ష్యం చేశారు
- పదేండ్లలో లక్షల కోట్లు ఖర్చు చేసి ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు
- బీజేపీ ఎంపీలు ఐఐఎం తెస్తే.. పాలమూరు జిల్లాలోనే భూమి ఇచ్చే బాధ్యత నాది
- మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, మహబూబ్‌నగర్

జనవరి 17: దశాబ్దాల క్రితం కాంగ్రెస్ పార్టీ నిర్మించిన ప్రాజెక్టులే ఇప్పటికీ మనకు జీవనాధారమని తెలిపారు. తాను కూడా సాగునీటి ప్రాజెక్టులు, విద్యా సంస్థలకే ప్రాధాన్యత ఇస్తున్నామని రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో భూస్వాములు, దొరల వద్ద లక్షలాది ఎకరాలు ఉండేదని, పీవీ నరసింహరావు ప్రభుత్వం భూగరిష్ఠ పరిమితి చట్టం తెచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూగరిష్ఠ పరిమితి చట్టం తెచ్చి మిగులు భూములను పేదలకు పంచిందని పేర్కొన్నారు. ఇప్పుడు పేదలకు భూమి పంచేందుకు కూడా ప్రభుత్వం వద్ద భూమి లేదన్న రేవంత్ పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం వద్ద భూమి లేదని స్పష్టం చేశారు. సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన వారికి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం చేస్తోందని గుర్తు చేశారు. బూర్గుల రామకృష్ణారావు తర్వాత మహబూబ్‌నగర్ జిల్లా బిడ్డకు సీఎం పదవి దక్కిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో రేవంత్ రెడ్డి పర్యటించారు. జడ్చర్లలో పలు అభివృద్ధి పనులకు సీఎం, మంత్రులు

...:: మిగతా 2లో



50 టిఎంసీలతో మున్నేరు, పాలేరు గ్రావిటీ లింక్

- రూ .57 కోట్ల కేటాయింపు
- ఖమ్మం,సూర్యాపేట, మహబూబా బాద్ జిల్లాలో 1.38 లక్షల ఎకరాలకు నీటి స్థిరీకరణ
- పాలేరు రిజర్వార్ ఎగువ భాగంలో 40 వేల ఎకరాల ఎన్.ఎస్.పి ఆయకట్టుకు భరోసా
- ఆకస్మిక వరదలతో జరిగే నష్టాలకు చెక్
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: సహజవనరులను వినియోగించడం ద్వారా వరద ప్రమాదాలను నివారించడంతో పాటు ఖమ్మం, సూర్యాపేట,మహబూబాబాద్ జిల్లాలకు సమృద్ధిగా సాగునీరు అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం మున్నేరుపాలేరు లింక్ పథకం నిర్మాణం చేపట్టిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అందుకోసం రాష్ట్రప్రభుత్వం 162.57 కోట్లు కేటాయించిందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న మున్నేరుపాలేరు లింక్ కాలువ పొడుగు 9.6 కిలోమీటర్లు కాగా

...:: మిగతా 2లో

సంగారెడ్డి ఇక గుడ్‌బై!

జీవితాంతం ఇక్కడ నుంచి పోటీ చేయను

- నిరుపేదల ఇళ్లే సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తా
- జగ్గారెడ్డి రాజకీయ స్పష్టత
- ఎవరిని ఓట్లు అడగను.
- నిర్మల జగ్గరెడ్డి బరిలో ఉంటారు
- ప్రతి పేద కుటుంబానికి 80 గజాల ఇంటి స్థలం ఇప్పిస్తా
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



...:: 2లో

సికింద్రాబాద్ అస్తిత్వాన్ని చెరిపేయొద్దు



- రేవంత్ తుగ్లక్ నిర్ణయాలతో తెలంగాణకు ప్రమాదం
- ప్రభుత్వ అరాచకాలు శాశ్వతం కావు
- బీఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: సికింద్రాబాద్ చారిత్రక అస్తిత్వాన్ని చెరిపివేసే కుట్రను వెంటనే విరమించుకోవాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. తుగ్లక్ పాలన గురించి పుస్తకాల్లో చదివామని, కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి పాలనను చూస్తే తుగ్లక్ ఎలా ఉంటాడో అర్థమవుతోందని

...:: మిగతా 2లో



మహా జాతర కు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు

- తుది దశకు చేరుకున్న పనులు
- క్షేత్ర స్థాయిలో సమీక్షిస్తున్న అధికార యంత్రాంగం
- సుమారు 3 కోట్లు భక్తులు వస్తారని అంచనా
- 21 శాఖలు, 42,027 మంది సిబ్బంది
- 2,000 మంది ఆదివాసీ వాలంటీర్లు
- 8 జోన్లు, 42 సెక్టర్లు గా పరిపాలన విభజన

...:: వివరాలు 3లో



రాహుల్ గాంధీతో డీకే భేటీ

కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ న్యూఢిల్లీలో రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గేతో భేటీ అయ్యారు. దీంతో కర్ణాటకలో నాయకత్వ మార్పుపై సాగుతున్న ఊహాగానాలకు మరోసారి రెక్కలు వచ్చాయి.

9



మహారాష్ట్రలో రిసార్ట్ రాజకీయాలు

బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికలు ముగిసి ఫలితాలు ఇలా వెలువడ్డాయో లేదో.. అలా ఫైవ్‌స్టార్ హోటల్ రాజకీయాలు మొదలయ్యాయి. ఆధిపత్యం కోసం ప్రయత్నాలు పారంభమయ్యాయి.

9



నలుగురు మావోయిస్టులు మృతి

మావోయిస్టులు, 'భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో శనివారం చోటుచేసుకుంది.

9



అల్లర్లకు ట్రంపే కారణం..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నిరసనలకు మద్దతిచ్చిన ట్రంప్‌ను నేరస్థుడిగా పరిగణిస్తున్నామన్న ఆయన.. ఇరాన్‌లో ఆందోళనలకు, ప్రాణ నష్టానికి ఆయనే కారణమని ఆరోపించారు.

9

రాజకీయం

మహిళలకు 50 శాతం

మొదటిపేజీ తరువాయి

జనరల్ మహిళ : నర్సాపూర్, యాదగిరిగుట్ట, ఆదిలాబాద్, సంగారెడ్డి, కోరుట్ల, మధిర, ధర్మపురి, సిరిసిల్ల, వైరా, రామాయంపేట, చౌటుప్పల్, అశ్వారావుపేట, ఆర్మూర్, సత్తుపల్లి, నారాయణ్‌పేట్, భువనగిరి, మరిపెడ, మిర్యాలగూడ, తూప్రాన్, బెల్లంపల్లి, ఆలియాబాద్, కోదాడ, భీమగల్, సదాశివపేట్, ఇస్నాపూర్, క్యాతన్‌పల్లి, చిట్యాల్, వనపర్తి, గద్వాల్, నిర్మల్, కల్వకుర్తి

ఎస్టీ మహిళ : కేసముద్రం, ఎల్లంపేట్

ఎస్సీ మహిళ : చేర్యాల్, వికారాబాద్, ఇంద్రేషం, గడ్డపోతారం ఎదులాపురం, మోత్కూర్, హుజూరాబాద్, చొప్పదండి

బీసీ మహిళలు : బాన్సువాడ, కామారెడ్డి, దుబ్బాక, కొల్లాపూర్, పరిగి, ఇల్లెందు, అచ్చంపేట్, చెన్నూరు, మెదక్, కొత్తకోట, ములుగు, అలేరు, ఆత్మకూరు, దేవరకొండ, గజ్వేల్, దేవరకద్ర, కాగజ్‌నగర్, జగిత్యాల్, నర్సంపేట

50 టిఎంసీలతో మున్నేరు, పాలేరు గ్రావిటీ లింక్

మొదటిపేజీ తరువాయి

ఇది సెకనుకు 4,500 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకునేల రూపొందించినట్లు ఆయన తెలిపారు. మేరకు ఆయన నేడిక్కడ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి అయితే ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలో 1.38 లక్షల ఎకరాలకు నీటి స్థిరీకరణతో పాటు పాలేరు రిజర్వాయర్ ఎగువ భాగంలోని 40 ఎకరాల ఎన్. ఎస్.పి ఆయకట్టుకు నీటి భద్రత లభిస్తుందని ఆయన వెల్లడించారు. మున్నేరు నది నుంచి ప్రతి సంవత్సరం వచ్చే వరద నీటిని సద్వినియోగం చేసుకోవడంతో పాటు వృధాగా పోతున్న సుమారు 50 టి.యం.సి ల నీటితో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అంకురార్పణ చుట్టిందన్నారు. ఇప్పటి వరకు ఈ నీరు వృధాగా సముద్రంలో కలుస్తుందని ఆ వృధాను అరికట్టడంతో పాటు ఆ నీటిని సద్వినియోగం చేసుకోవడమే ప్రభుత్వ సంకల్పమన్నారు. నికి తోడు ఖమ్మం జిల్లాలో మున్నేరు నుండి వస్తున్న నీటితో సంభవిస్తున్న నష్టాన్ని నివరించందుకు ప్రభుత్వ నిర్ణయం దోహద పడుతుందన్నారు. మున్నేరు నది వరద జలాలతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం ముల్కనూర్ గ్రామంలోనీ చెక్ డ్యామ్ ద్వారా నీరు మళ్లించి నిర్మించే మున్నేరుపాలేరు లింక్ పథకంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ స్టేజ్ 2 ను బలోపేతం చేయడంతో పాటు పాలేరు రిజర్వాయర్ ద్వారా భక్త రామదాసు ఎత్తిపోతల పథకం కింద ఉన్న డి.బి.యం 60 ద్వారా ఖరీఫ్ సాగుకు 70,308 ఎకరాల ఆయకట్టుకు అదనపు నీటి లభ్యత చేకూరుతుందని ఆయన తెలిపారు. అదే విదంగా సూర్యాపేట జిల్లాలోని మోతే ఎత్తిపోతల పథకం ద్వారా డి.బి.యం 71 కింద ఉన్న 46,712 ఎకరాల భూమికి నిరంతరం సాగునీటిని అందించవచ్చన్నారు. ఈ ప్రాజెక్టుతో కేవలము సాగునీరు మాత్రమే కాకుండా ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలో తాగు నీటి అవసరాల కోసం మిషన్ భగీరథ పథకానికి 4.70 నీటిని కేటాయిస్తున్నట్లు ఆయన వివరించారు. న్నింటికీ మించి ఈ ప్రాజెక్ట్ నిర్మాణం ద్వారా సీతారామ ప్రాజెక్టు కు వినియోగించేందుకు వినియోగిస్తున్న విద్యుత్ చార్జీలకై రాష్ట్ర ప్రభుత్వం సాలీనా చెల్లుస్తున్న విద్యుత్ చార్జీల భారం నుండి తప్పించుకోవడంతో పాటు అదనపు నీటితో పాలేరు రిజర్వాయర్ దిగువన ఉన్న హైడల్ ప్లాంట్ లో 2 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. త్తంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా మున్నేరు ఉగ్రరూపం దాల్చిన ప్రతి సమయంలో అతలాకుతలం అయ్యే ప్రాంతాల ప్రజలకు ఇకపై ఎటువంటి ఇబ్బంది కలగదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సుస్పష్టం చేశారు.









పేదరికం.. నిరక్షరాస్యత నా శత్రువులు

మొదటిపేజీ తరువాయి

శంకుస్థాపన చేశారు. జడ్చర్ల మండలం చిట్టబోయినపల్లిలో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి భూమి పూజ చేసిన సీఎం, మహబూబ్‌నగర్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, మంత్రి దామోదర రాజనరసింహ, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి నిర్వహించారు.

ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది :

మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.1,284 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ ప్రాజెక్టు కట్టినా వాటిలో పాలమూరు బిడ్డల శ్రమ ఉందన్న సీఎం వివిధ ప్రాంతాలకు వలస వెళ్లి తట్ట పని, మట్టి పని చేసిన వాళ్లు పాలమూరు బిడ్డలని తెలిపారు. దేశంలో అత్యంత వెనకబడిన మండలం జిల్లాలోని గట్టు మండలమని, బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు పాలమూరు జిల్లా ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కేసీఆర్ పదేళ్ల పాటు పాలమూరు జిల్లాకు ఒక్క ప్రాజెక్టు కూడా సాధించలేదని ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును 2013లో అప్పటి కాంగ్రెస్ నేతలు సాధించారని అన్నారు. ప్రాజెక్టు పేరు మీద రూ.23 వేల కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించారు కానీ ప్రాజెక్టు పూర్తి చేయలేదని, ఉద్ధండాపూర్ జలాశయం భూనిర్వాసితులకు నిధులు చెల్లించలేదని, సంగంబండ వద్ద బండ పగలగొట్టేందుకు కేసీఆర్ పదేళ్లలో రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు.

ఎవరూ శత్రువులు లేరు :

ప్రాజెక్టులకు అనుమతులు, నిధులు తెచ్చేందుకే ప్రధాని మోదీని కలుస్తున్నానన్న రేవంత్ రెడ్డి ఎన్నికలప్పుడే రాజకీయాలు చేస్తామని, తర్వాత ప్రజల కోసం కలిసి పని చేస్తామని వెల్లడించారు. తనకు ఎవరూ శత్రువులు లేరని, రాజకీయ ప్రత్యర్థులను ఎన్నికల్లోనే ఓడించానని, ఎన్నికల తర్వాత తనకు ఎవరి మీద కోపం లేదని, శత్రుత్వం లేదని, పేదరికం, నిరక్ష్యరాస్యత మాత్రమే మనకు శత్రువులుగా భావిస్తామని తెలిపారు.

మూడేళ్లకే కూలింది

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన చివరి జీవో నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకమని, నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ పదేళ్లపాటు నిర్లక్ష్యం చేశారని అన్నారు. గతంలో పాలమూరు జిల్లాలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జిల్లాలోని ప్రాజెక్టుల గురించి అడగలేదని, మాజీ సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలెవరినీ తన ఫామ్‌హౌస్‌లోకి రానీయలేదని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చ పెడితే సభకు రాకుండా పారిపోయారని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి ఐఐఎం సాధిస్తే పాలమూరు జిల్లాలోనే భూమి ఇచ్చే బాధ్యత తనదని, పాలమూరు జిల్లాను వెనకబడిన జిల్లాగా ఇంకా ఎన్నాళ్లు చూపించాలి? ప్రశ్నించారు. పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేసే బాధ్యత తనదని స్పష్టం చేశారు. మారీచ, సుబాహులు ఏ రూపంలో వచ్చినా ఈసారి ప్రజలు తరిమికొడతారని, పదేళ్లలో రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేశారు కానీ ఒక్క ప్రాజెక్టు పూర్తి కాలేదని, కాళేశ్వరం ప్రాజెక్టు ఒక్కటి పూర్తి చేశారని అది మూడేళ్లకే కూలిందని విమర్శించారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, ఈ ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఇవాళ 3.50 కోట్ల మంది పేదలకు రేషన్‌కార్డుపై సన్నబియ్యం ఇస్తున్నామని, మహిళలకు పంపిణీ చేసిన బతుకమ్మ చీరల్లో కూడా కమీషన్లు తిన్నారని తెలిపారు. సూరత్ నుంచి కిలోల చొప్పున చవక చీరలు తెచ్చి నేత చీరలు అని మోసం చేశారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమే కాదని, అద్దె బస్సులకు యజమానులుగా చేశామని అన్నారు. మహిళలు పెట్రోల్ బంకులు పెట్టుకుంటే భూమి కూడా ఇస్తున్నామని వివరించారు.

సికింద్రాబాద్ అస్తిత్వాన్ని చెరిపేయొద్దు

మొదటిపేజీ తరువాయి

ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో పార్టీ సీనియర్ నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించిన కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్-సికింద్రాబాద్ ప్రపంచవ్యాప్తంగా జంట నగరాలుగా గుర్తింపు పొందాయని గుర్తుచేశారు. అలాంటి చారిత్రక నగరాల్లో ఒకటైన సికింద్రాబాద్ గుర్తింపును పూర్తిగా తొలగించేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. ఇది ప్రజల అస్తిత్వంపై దాడి చేయడమేనని అన్నారు. 420 హామీలతో అధికారంలోకి వచ్చి పేర్ల మార్పులకే పరిమితం ఆరు గ్యారెంటీల పేరుతో, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, హామీల అమలును పక్కనపెట్టి కేవలం పేర్లు మార్చడం పైనే దృష్టి పెట్టిందని కేటీఆర్ మండిపడ్డారు. టీఎస్‌ను తీసేసి టీజీ అనడం, తెలంగాణ తల్లిని మార్చడం, తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను తొలగించడం, అధికార చిహ్నం నుంచి కాకతీయ తోరణం-చార్మినార్ తొలగించడం వల్ల ప్రజలకు ఏం లాభమో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. ఇవన్నీ తుగ్లక్ పనులు తప్ప మరొకటి కాదని విమర్శించారు. వీకేంద్రీకరణే కేసీఆర్ దూరదృష్టి ప్రజల దగ్గరికి పాలన తీసుకెళ్లాలన్న విశాల దృక్పథంతోనే కేసీఆర్ వీకేంద్రీకరణ ప్రారంభించారని కేటీఆర్ గుర్తుచేశారు. కొత్త గ్రామాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాలు ఏర్పాటు చేసి 10 జిల్లాలను 33 జిల్లాలుగా విస్తరించారని చెప్పారు. హైదరాబాద్‌లోనూ వార్డులు, జోన్లు పెంచి అభివృద్ధి నిధులు అధికంగా ఇచ్చామని తెలిపారు. సికింద్రాబాద్ ప్రజల ఐక్య పోరాటం సికింద్రాబాద్‌లోని అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటం చేస్తున్నారని కేటీఆర్ తెలిపారు. ప్రజల ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తోందన్నారు. సికింద్రాబాద్‌లో పుట్టిన బిడ్డలుగా అక్కడి అస్తిత్వాన్ని కాపాడేందుకు ప్రజలు పోరాటం చేస్తున్నారని చెప్పారు.

శాంతి ర్యాలీపై ప్రభుత్వ దమనకాండ

శాంతియుతంగా నిర్వహించాలనుకున్న ర్యాలీకి మొదట అనుమతి ఇచ్చి, చివరి నిమిషంలో అనుమతి లేదంటూ వేలాది మందిని అరెస్టు చేయడం ప్రభుత్వ అరాచకానికి నిదర్శనమని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సాధారణ ప్రజలను ఎక్కడికక్కడ అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. అరెస్టు చేసిన వారందరినీ వెంటనే భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అధికారం శాశ్వతం కాదు

ఇలా అక్రమంగా, అన్యాయంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం గుర్తుంచుకోవాల్సిందేమిటంటే అధికారం శాశ్వతం కాదని కేటీఆర్ హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ఎల్లకాలం ముఖ్యమంత్రి కాదని స్పష్టం చేశారు. శాంతి ర్యాలీని భగ్నం చేశామని ప్రభుత్వం తాత్కాలిక ఆనందం పొందవచ్చని, కానీ రాజ్యాంగబద్ధంగా తమ నిరసన హక్కును వినియోగించుకుంటూ కోర్టుకు వెళ్లి మళ్లీ శాంతి ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తే సికింద్రాబాద్ జిల్లా

ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత సికింద్రాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా మారుస్తామని, ప్రజల ఆకాంక్షల మేరకు అన్ని డిమాండ్లను నెరవేర్చుతామని హామీ ఇచ్చారు.

ఫ్యూచర్ లేని సీఎం – ఫ్యూచర్ సిటీ మాటలు

ఫ్యూచర్ లేని ముఖ్యమంత్రి ఫ్యూచర్ సిటీ కడతామని మాట్లాడటం విడ్డూరమని కేటీఆర్ ఎద్దేవా చేశారు. పదేళ్ల తర్వాత జిల్లాలు తీసేస్తామని రేవంత్ రెడ్డి చెప్పడం వెనుక ప్రజల దగ్గరికి పాలన రావడంపై ఉన్న అసహనమేనని విమర్శించారు. సమీకృత కలెక్టరేట్ల ద్వారా ప్రజలకు సేవలు అందుతుంటే ప్రభుత్వానికి ఎందుకు నొప్పో అర్థం కావడం లేదన్నారు.

రాహుల్ గాంధీ స్పందించాలి

తెలంగాణలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై రాహుల్ గాంధీ స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరును ఆయన గుర్తించాలని, ఇదేనా రాజ్యాంగ స్ఫూర్తి అని ప్రశ్నించాలన్నారు.

సంగారెడ్డి ఇక గుడ్‌బై!

జీవితాంతం ఇక్కడ నుంచి పోటీ చేయను

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 17 :

తెలంగాణ రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న సంగారెడ్డి అంటే జగ్గారెడ్డి అనే ఫైర్ బ్రాండ్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్ రెడ్డి @ జగ్గారెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు.నియోజకవర్గం లో ప్రజలకు ఏ కష్టం వచ్చిన "నేనున్నా" అంటూ ముందుండే నాయకుడు, అయన భవిష్యత్ రాజకీయాల పై సంచలన వాక్యలు చేశారు. ఇక పై జీవితంలో సంగారెడ్డి నుండీ తాను ఎమ్మెల్యే గా పోటీ చేయబోనని స్పష్టం చేస్తూ రాజకీయ వర్గాల్లో ప్రకంపణలు సృష్టించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తన ఓటమి పై జగ్గారెడ్డి తీవ్ర భవోద్వేగానికి లోనయ్యారు. తన గెలుపు కోసం స్వయంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వచ్చి ప్రచారం చేసినా స్థానిక ప్రజలు నన్ను ఓడించారు. ఆయనను ఇక్కడికి పిలిపించి అవమానించానేమో అని నా మనసులో చాలా బాధగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. రాహుల్ గాంధీ వంటి పెద్ద నాయకుడి ఇమేజ్ తన ఓటమి వలన మచ్చ పడిందేమోనని భావిస్తున్నాను అంటూ తన ఆవేదన వ్యక్తం చేశారు. తన ఓటమి పై కారణాలు విశ్లేషస్తూ, నియోజకవర్గ మేధావులపై జగ్గారెడ్డి విమర్శలు చేశారు. సంగారెడ్డి అభివృద్ధి కి, ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకున్నప్పటికి ఇక్కడి మేధావులే తనను ఓడించడంలో ప్రధాన పాత్ర పోషించారని అయన ఆరోపించారు. క్షేత్రస్థాయిలో తాను చేసిన సాయం కంటే, మేధావుల ఆలోచనా ధోరణి తనను దెబ్బ తీసిందని అయన అభిప్రాయం వ్యక్తం చేశారు. పేదాలతో ఏర్పాటు చేసిన ముఖా ముఖిలో నియోజకవర్గం నిరు పెదలందరికి ఇంటి స్థలాలు కల్పించి వారి కుటుంబలల్లో వెలుగులు తేవడమే లక్ష్యంగా పని చేస్తానని టి పి సిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. శనివారం సంగారెడ్డి పట్టణం లోని గంజీ మైదాన్ లో ఏర్పాటు చేసిన పేదలతో ముఖా ముఖి. గతంలో ఇండ్ల పట్టాలు కల్పించిన మరియు లేని వారితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో టిజిఐసిసి చెర్మెన్ నిర్మల జగ్గారెడ్డి ప్రత్యేక ఆహ్వాని తురాలుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20122013 లో ఇంటి పట్టాలు కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. అందులో లేని వారికి కూడా ఇంటి స్థలాలు కల్పించటం జరుగుతుందన్నారు. మున్సిపాల్ కమిషనర్ ఓ తేది తెలుపటం జరుగుతుందని అందరు దరఖాస్తు లు చేసుకోవాలని సూచించారు. జగ్గారెడ్డి మాటలు రాజకీయాల్లో మరోసారి చర్చకు దారి తీస్తున్నాయి. నిరుపేదల ఇళ్ల సమస్యను కేంద్రబిందువుగా చేశారు. పేదలకు ఇండ్లు కల్పించడమే తన జీవిత లక్ష్యమని స్పష్టం చేస్తూనే, తాను సంగారెడ్డి నుంచి ఎన్నికల్లో పోటీ చేయనని రాజకీయ స్పష్టత ఇచ్చారు.ఇకపై ఓట్లు కూడా అడగనని చెప్పడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతున్నాయి, కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమామే ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుందన్నారు. 2012-13లో ఇళ్ల పట్టాలు పొందిన వారితో పాటు ఇప్పటికీ స్థలం లేని పేదలకు ఇంటి జాగ కల్పించడమే తన ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.తాను కూడా 22 సంవత్సరాలు కిరాయి ఇంట్లోనే జీవించిన అనుభవం ఉందని, అందుకే కిరాయి ఇళ్ల బాధ తనకే ఎక్కువగా తెలుసని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2013లో అప్పటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డితో చర్చించి సంగారెడ్డిలోని 5,500 మంది పేదలకు 80 గజాల చొప్పున ఇంటి స్థలాలు ఇప్పించేందుకు కృషి చేశానని గుర్తుచేశారు. అయితే ఆ స్థలాలను బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఇతర అవసరాలకు వినియోగించారని ఆరోపించారు.పదేళ్ల కాలంలో పేదలు తమకు ఇచ్చిన స్థలాలపై ఎందుకు ప్రశ్నించలేదని ప్రజలను ప్రశ్నించారు. ఐన పేదలకు న్యాయం చేయడానికే సంగారెడ్డి, కంది మండలాల్లో 200 ఎకరాల భూసేకరణకు సిద్ధమయ్యామని చెప్పారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్‌తో చర్చించామని, జనవరి నుంచే ప్రక్రియ ప్రారంభించి నవంబర్ నాటికి ఒక కొలిక్కి తీసుకొస్తానని స్పష్టం చేశారు.ఓటర్లు పని చేసే నాయకులు గూర్చి ఆలోచించాలన్నారు.వెయ్యి రూపాయల నోటు కోసం, క్వార్టర్ మద్యం కోసం జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. నేడు పేదలు సంగారెడ్డిలో నెలకు రూ.5,000 ఇంటి కిరాయి చెల్లిస్తే ఏడాదికి రూ.60 వేలు, పదేళ్లకు రూ.6 లక్షల నష్టం జరుగుతుందని వివరించారు. ఓట్లు వేసే సమయంలో అప్పుడే సరైన నిర్ణయం తీసుకుని ఉంటే ఈ డబ్బు మిగిలేదని వ్యాఖ్యానించారు.తన రాజకీయ ఓటమిపై ఎప్పుడూ బాధపడలేదని, అదే తన భార్య నిర్మల జగ్గారెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడానికి కారణమైందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అధికారంలో ఉందని, సీఎం రేవంత్ రెడ్డి తన మాట వింటారని ధీమా వ్యక్తం చేస్తూ, సంగారెడ్డిలో ఇల్లు లేని ప్రతి పేదవాడికి 80 గజాల ఇంటి స్థలం ఖచ్చితంగా ఇస్తానని హామీ ఇచ్చారు. మొత్తంగా ఈ వ్యాఖ్యలు కేవలం రాజకీయ ప్రకటనలుగా కాకుండా, పేదల ఇళ్ల సమస్యపై ప్రభుత్వ బాధ్యతను గుర్తు చేస్తున్నాయని పేర్కొన్నారు. భూసేకరణ, జరుగగానే మళ్లి మీతో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.





ప్రాధాన్యతల వారీగా నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలి. గతేడాది గడుపు పెట్టుకుని హంద్రీ-నీవా కాల్వ వెడల్పు పనులు పూర్తి చేశాం. పోలవరం పనులు పరుగులు పెట్టించాం. 2026లో వెలిగొండ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల నిర్మాణ పనులు పూర్తవ్వాలి.

- ఏపీ సీఎం చంద్రబాబు.



మహా జాతర కు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు

- తుది దశకు చేరుకున్న పనులు
- క్షేత్ర స్థాయిలో సమీక్షిస్తున్న అధికార యంత్రాంగం
- సుమారు 3 కోట్లు భక్తులు వస్తారని అంచనా
- 21 శాఖలు, 42,027 మంది సిబ్బంది
- 2,000 మంది ఆదివాసీ వాలంటీర్లు
- 8 జోన్లు, 42 సెక్టర్లు గా పరిపాలన విభజన



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 17 : మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర-2026కు తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేపట్టింది. కోట్లాది భక్తులు తల్లుల దర్శనానికి వచ్చే ఈ మహా పర్వంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఈ ఏర్పాట్లన్నింటిపై నిత్యం ప్రత్యక్ష పర్యవేక్షణ చేయడానికి రాష్ట్ర మంత్రులు, అధికార యంత్రాంగం మేడారంలోనే బస చేస్తూ, క్షేత్రస్థాయిలో ప్రతి అంశాన్ని పరిశీలిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం, సుభిక్ష దర్శనం ప్రథమ ప్రాధాన్యతగా మారింది. ఈ సారి సుమారు మూడు కోట్ల మంది భక్తులు వస్తారనే అంచనాతో, ఎక్కడా ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు కలిసి సమగ్ర ప్రణాళికతో పని చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ జాతర కోసం మొత్తం 21 శాఖలకు చెందిన 42,027 మంది అధికారులు, సిబ్బంది, మేడారం పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహించనున్నారు. వీరికి అదనంగా 2 వేల మంది ఆదివాసీ యువత వాలంటీర్లుగా తమ సేవలు అందించనున్నారు. మొబైల్ నెట్ వర్క్ కి ఎలాంటి అంతరాయం కలగకుండా 27 శాశ్వత టవర్ల తో పాటు తాత్కాలిక పద్ధతిలో 33 మొబైల్ టవర్లను, 450 వెరీ హై ఫ్రీక్వెన్సీ సెట్లను ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని క్రమబద్ధంగా నియంత్రించేందుకు మేడారం ప్రాంతాన్ని 8 పరిపాలనా జోన్లుగా, 42 సెక్టర్లుగా విభజించారు. ఒక్కో జోన్ కు జిల్లా స్థాయి అధికారి ఇంచార్జ్ గా వ్యవహరిస్తారు. ఒక్కో సెక్టార్ కు మండల స్థాయి అధికారి భాధ్యతలు నిర్వర్తిస్తారు. ఆలయ ప్రాంగణం, గద్దెలు, జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్, ఊరట్టం, శివరాం సాగర్, నర్లాపూర్, పడిగాపూర్ వంటి అన్ని కీలక ప్రాంతాల్లో కంట్రోల్ రూములు, మిస్సింగ్ పర్సన్స్ క్యాంపులు, అత్యవసర స్పందన బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రాకపోకల్లో ఇబ్బందులు రాకుండా మొత్తం 525 చోట్ల రహదారి సమస్యలను గుర్తించి పరిష్కరించారు. జాతరకు ఉపయోగపడే కొత్త రోడ్లు, మరమ్మత్తులు, కల్వర్టులతో రవాణా వ్యవస్థను బలోపేతం చేశారు. వాహనాల రద్దీ తగ్గించేందుకు అటవీ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో మొత్తం 1,418 ఎకరాల విస్తీర్ణంలో 42 పార్కింగ్ ప్రాంతాలు సిద్ధం చేశారు. తాగునీటి సమస్య తలెత్తకుండా మిషన్ భగీరథ ద్వారా నిరంతం తాగు నీటి సరఫరా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 5,482 తాగు నీటి నల్లాలు ఏర్పాటు చేసి భక్తులకు శుద్ధమైన నీటిని అందిస్తున్నారు. జంపన్నవాగులో పవిత్ర స్నానాలు చేసే భక్తుల కోస 119 డ్రెస్సింగ్ రూములు ఏర్పాటు చేయడంతో పాటు నీటి పరిశుభ్రత కోసం ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయనున్నారు. 285 బ్లాకుల్లో 5700 టాయిలెట్లను సిద్ధం చేశారు. వీటికి అధనంగా మొబైల్ టాయిలెట్స్ ను అందుబాటులోకి తేనున్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం 5 వేల మంది సిబ్బందిని, 150 ట్యాంకర్లు, 100 ట్రాక్టర్లు, 18 స్వీపింగ్ మిషిన్లు, 12 జేసీబీ, 40 స్వచ్ఛ ఆటోలు, 16 డోజర్లను రంగంలోకి దింపారు. జాతర ప్రాంతంలో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా టీజీఎన్‌పీడీసీఎల్ ద్వారా 196 ట్రాన్స్‌ఫార్మర్లు, 911 విద్యుత్ స్తంభాలు, 65.75 కిలోమీటర్ల విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయం తలెత్తకుండా 350 మంది సిబ్బందిని నియమించారు. ఆలయాలు, ప్రధాన మార్గాలు, పార్కింగ్ ప్రాంతాల్లో వేల సంఖ్యలో హై పవర్ లైట్లు వెలుగులు పంచుతుండగా, అత్యవసర పరిస్థితుల కోసం 28 డీజిల్ జనరేటర్లు బ్యాకప్‌గా సిద్ధంగా ఉన్నాయి. భక్తులు సులభంగా మేడారానికి చేరుకునేందుకు టీజీఆర్టీసీ ఈసారి 4000 బస్సులను వినియోగంలోకి తెచ్చి 51,000 ట్రిప్పులు నిర్వహిస్తోంది. ప్రత్యేక బస్టాండ్లు, ప్రత్యేక రూట్లతో రవాణా వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహిస్తున్నారు. జాతర కోసం 10441 మంది ఆర్టీసీ సిబ్బంది సేవలందించనున్నారు. గంటకు 15 బస్సులు ప్రయాణించేలా ప్లాన్ చేస్తున్నారు. జాతర సమయంలో ఆరోగ్య సేవల కోసం మొత్తం 5,192 మంది వైద్య సిబ్బందిని నియమించారు. భక్తులకు సేవలందించేందుకు 30 అంబులెన్సులు, 40 బైక్ అంబులెన్సులు, 50 పడకల ప్రధాన ఆసుపత్రి, రోజుకు 30 మెడికల్ క్యాంపులు పనిచేస్తాయి. జంపన్నవాగులో ప్రమాదాలను నివారించేందుకు 210 మంది గజ ఈతగాళ్లు, 12 మంది సింగరేణి రెస్క్యూ సిబ్బంది, 100 SDRF బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. అగ్నిప్రమాదాలను ఎదుర్కొనేందుకు 15 ఫైర్ బ్రిగేడ్ వాహనాలు, 268 మంది ఫైర్ ఫైటర్లు సిద్ధంగా ఉన్నారు. అటవీ శాఖ ద్వారా పార్కింగ్, రోడ్లతో పాటు పర్యావరణ సంరక్షణ చేపడుతుండగా, ఐటిడీఏ ఆధ్వర్యంలో గిరిజనులకు కొబ్బరి కాయ, బెల్లం, ఇతర వ్యాపారాల కోసం లైసెన్సులు ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నారు. మొత్తంగా మేడారం మహాజాతర-2026ను ప్రపంచ స్థాయిలో నిర్వహించాలనే లక్ష్యంతో, అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు త్వరితగతిన తల్లుల దర్శనం, సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోంది.

అత్యాధునిక వసతులతో మీడియా సెంటర్

మేడారం మహా జాతర విశేషాలను దేశ విదేశీ భక్తులకు అనుక్షణం, ఎప్పటికప్పుడు అందించుటకు ప్రింట్, ఎలక్ట్రానిక్, ఇతర ప్రచార, ప్రసార మాద్యమాల సౌకర్యార్థం రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖచే అమ్మవార్ల గద్దెల పక్కన ఉన్న టీటీడీ కళ్యాణ మండపంలో జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా మీడియా సెంటర్ ఏర్పాటు చేయనైనది. ఇక్కడ మీడియా సెంటర్ నుండి, ఫోటోలు, వీడియోలు, వార్తలు నేరుగా పంపించుకొనే ఏర్పాటు చేయడం జరిగింది.






తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ చౌమహల్లా ప్యాలెస్ లో అనిత సింఘ్వీ గజల్ & సంగీత విభావరి కార్యక్రమం శనివారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.
ప్రతిపక్షం, హైదరాబాద్

మేడారంపై పోలీసుల డేగ కన్ను

- కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించిన మంత్రి సీతక్క
- 450 సీసీ కెమెరాలతో కట్టుదిట్టమైన నిఘా
- భద్రత విషయంలో ఎలాంటి రాజీ వద్దు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 17: మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర సందర్భంగా శాంతి భద్రతల ఏర్పాట్లపై రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనుసరి అనసూయ సీతక్క ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మేడారంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి, అక్కడి నుంచి కొనసాగుతున్న భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. జాతర ప్రాంతం అంతటా సుమారు 450 సీసీ కెమెరాల ద్వారా పోలీసులు కట్టుదిట్టమైన నిఘా కొనసాగిస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని భారీ ఎల్ఈడీ స్క్రీన్‌పై జాతర ప్రాంగణంలో జరుగుతున్న కార్యక్రమాలు, భక్తుల రాకపోకలు, జనసాంద్రత పరిస్థితులను మంత్రి సీతక్క ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరిగితే పోలీసులు ఎలా స్పందిస్తారు, ముందస్తు చర్యలు, సన్నాహాలు ఏమిటన్న అంశాలను పోలీస్ అధికారులు మంత్రికి వివరించారు. భద్రత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రతి చిన్న అంశాన్ని కూడా అప్రమత్తతతో పర్యవేక్షించాలని మంత్రి సీతక్క పోలీస్ అధికారులకు స్పష్టంగా ఆదేశించారు. భక్తులు నిర్భయంగా, ప్రశాంతంగా జాతరలో పాల్గొనేలా భద్రతా ఏర్పాట్లు ఉండాలని, పోలీస్ యంత్రాంగం 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్., జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్, ఐటిడిఏ పి ఓ చిత్ర మిశ్రా, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకారం

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు
- టీఎన్జీవో కేంద్ర సంఘం డైరీ ఆవిష్కరణ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 8: ఉద్యోగుల సమస్యల సాధనలో టీఎన్జీవో సంఘం గత ఎనిమిది దశాబ్దాలు ఎనలేని కృషి చేస్తున్నదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నార. శనివారం తెలంగాణ ఎన్జీవో ల కేంద్ర సంఘం 2026 డైరీ క్యాలెండర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను గ్రౌండ్ లోకి తీసుకెళ్లే బాధ్యత ఉద్యోగులదేదే, ఉద్యోగులు ప్రభుత్వం వేరు వేరు కాదని, సమస్యలు ఉన్నంత వరకు సంఘాలు ఉంటాయని, చిన్న స్థాయిలో పనిచేసే ఉద్యోగి హక్కులకోసం పోరాడే స్వభావం టీఎన్జీవో సంఘానికి ఉన్నదని, మా నాన్న గారు కూడా రైల్వే ఉద్యోగిగా ఎప్పుడూ రైల్వే కార్డు ను జేబులో పెట్టుకుని తిరిగేవారు కనుక సమస్యలను పరిష్కరించుకోవడానికి మీ వెంట ఉంటానని అంశాలవారిగా ఒక్కక్క సమస్యను పరిష్కరించుకుందామని భవిష్యత్ లో అన్ని విధాలుగా మంచి జరగాలని కోరుకుంటూ రాష్ట్ర అభివృద్ధిలో ప్రభుత్వ ఉద్యోగుల క్రమశిక్షణ తో కూడిన భాగస్వామ్యంతోనే జరుగుతుందని అన్నారు. అంతకు ముందు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, ఎస్. ఏం హుస్సనీ ముజీబ్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రధాన సమస్యలైన పీఆర్సి, పెండింగ్ డీఏ ల విడుదల, పెండింగ్ బిల్లుల మంజూరు, పాత పెన్షన్ విధానం అమలు, హెల్త్ కార్డ్స్ మంజూరు తదితర డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద గౌరవ ముఖ్యమంత్రి, సీ.ఎస్ మీద ఉందని, క్రింది స్థాయిలో పని చేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, పోరాటాలకు పిలుపు ఇవ్వాలని మా మీద తీవ్ర వత్తిడి ఉందని కానీ ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని ప్రతి సందర్భంలో ముఖ్యమంత్రి వివరిస్తున్నారు కనుక దాదాపుగా రెండు ఏండ్లకు పైగా సమస్యలు పరిష్కారం కావడం లేదు కేవలం 3 పెండింగ్ డీఏ లు విడతల వారిగా ఇచ్చినప్పటికీ మళ్ళీ 5 పెండింగ్ డీఏ లు అయ్యాయి కనుక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యత తీసుకుని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, కోశాధికారి ముత్యాల సత్యనారాయణ, నాల్గో తరగతి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి 33 జిల్లా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు మరియు కేంద్ర సంఘం నాయకులు పాల్గొన్నారు..



రాష్ట్రంలో రోహిత్ వేముల చట్టాన్ని తీసుకొస్తాం

- జస్టిస్ ఫర్ రోహిత్ వేముల క్యాంపెయిన్ కమిటీ తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 17 : రాష్ట్రంలో వీలైనంత తొందరగా రోహిత్ వేముల చట్టాన్ని తీసుకువస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ప్రజాభవన్ లో జస్టిస్ ఫర్ రోహిత్ వేముల క్యాంపెయిన్ కమిటీ సభ్యులతో డిప్యూటీ సీఎం సమావేశం అయ్యారు. రాష్ట్రంలో రోహిత్ వేముల చట్టం తీసుకురావాలంటూ దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సైతం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారని గుర్తు చేశారు, సీఎం రేవంత్ రెడ్డి తో చర్చించి రోహిత్ చట్టాన్ని తీసుకు వచ్చేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని కమిటీకి తెలియజేశారు. కర్ణాటక రాష్ట్రంలో రోహిత్ వేముల చట్టం కోసం క్యాంపెయిన్ కమిటీ రూపొందించిన ముసాయిదాను కమిటీ సభ్యులు డిప్యూటీ సీఎంకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కొన్ని విజ్ఞప్తులు చేశారు. రోహిత్ వేముల కేసును పారదర్శకంగా విచారణ జరిపించాలని, న్యాయం చేయాలని కోరారు. రోహిత్ వేముల మరణం తర్వాత యూనివర్సిటీలో 50 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్ల పైన నాన్ బెయిలబుల్ కేసులు నమోదయ్యాయి వీటినుంచి వారికి విముక్తి కల్పించాలని కోరారు. కర్ణాటక రాష్ట్రం తరహాలోనే తెలంగాణలోనూ రోహిత్ వేముల చట్టాన్ని తీసుకురావాలని కోరారు.

సికింద్రాబాద్ అస్తిత్వంపై కాంగ్రెస్ దాడి

- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- కోర్టు అనుమతితో శాంతి ర్యాలీ నిర్వహిస్తాం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 17: సికింద్రాబాద్ అస్తిత్వాన్ని చెరిపివేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి సీనియర్ నేతలు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్‌కు అద్భుతమైన చరిత్ర ఉందని, జంట నగరాలు అంటే చారిత్రకంగా హైదరాబాద్-సికింద్రాబాద్ అని తలసాని గుర్తు చేశారు. అయితే ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం జంట నగరాల్లో ఒక నగరాన్ని పూర్తిగా తుడిచివేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. సికింద్రాబాద్ అస్తిత్వం అక్కడి ప్రజల హక్కు, వారి ఆత్మగౌరవంతో ముడిపడి ఉందన్నారు.

సికింద్రాబాద్ ప్రజల తరఫున మాట్లాడితే తనపై కేసులు పెట్టారని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రులు మరింత దారుణంగా మాట్లాడినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. సికింద్రాబాద్ కోసం ఆటో డ్రైవర్ల నుంచి బస్తీవాసుల దాకా అందరూ పోరాటానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. శాంతి ర్యాలీకి పోలీసులు మొదట అనుమతి ఇచ్చారని, రూట్ మ్యాప్ కూడా సిద్ధం చేశారని తెలిపారు. అయితే ఐదు రోజుల పాటు అనుమతి ఇస్తామని చెప్పి, అర్ధరాత్రి సమయంలో రద్దు చేయడం అన్యాయమని అన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ క్లాక్ టవర్ వద్ద భారీగా పోలీసులను మోహరించి, వేలాదిమంది ప్రజలను అరెస్టు చేసి తరలించారని ఆరోపించారు. నల్లజెండాలు, కండువాలతో 'సికింద్రాబాద్ బచావో' పేరుతో శాంతి ర్యాలీ నిర్వహించాలని భావించామని, అనుమతి రద్దు చేసిన విషయాన్ని ముందే తెలిపి ఉంటే కోర్టును ఆశ్రయించేవాళ్లమని చెప్పారు. తాత్కాలికంగా శాంతి ర్యాలీని అడ్డుకుని ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందవచ్చని, కానీ న్యాయపరంగా కోర్టు అనుమతి తీసుకొని మరోసారి శాంతి ర్యాలీ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. మరోసారి కోర్టు అనుమతి తీసుకొని వచ్చే మొదటి వారంలో శాంతి ర్యాలీతో పాటు అనేక ఇతర కార్యక్రమాలు కూడా చేపడతామని బీఆర్ఎస్ నేతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా వ్యవహరిస్తే తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించారు.



త్వరలో జరగనున్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలి . అధికార కాంగ్రెస్‌కు ఓటేస్తే అభివృద్ధికి నయాపైసా రాదని, బీఆర్ఎస్‌కు వేస్తే వృథా. బీజేపీకి ఓటేస్తే కేంద్రం నుంచి నిధులు వస్తాయనే విషయాన్ని ప్రజలు గమనించాలి.

- కేంద్ర మంత్రి బండి సంజయ్

ముందుకు సాగని వాణిజ్య చర్చలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ నేరుగా మాట్లాడకపోవడం వల్లనే ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదరలేదంటూ ఆ దేశ వాణిజ్య శాఖ మంత్రి హోవార్డ్ లుట్నిక్ పేర్కొనడం ఆసక్తి కలిగించింది. రెండు దేశాలు సిద్ధమైన వెంటనే ఒప్పందాన్ని ప్రకటిస్తామని చెప్పారు. చర్చలకు గడువు అనేది చెప్పలేమని స్పష్టం చేశారు. ఇరు దేశాల చర్చా బృందాలు పెండింగ్‌లో ఉన్నదాదాపు అన్ని అంశాలపై వర్చువల్ గా చర్చలు కొనసాగిస్తున్నాయని అగర్వాల్ చెప్పారు. ఒప్పందం చాలా దగ్గరలోనే ఉందని, అయితే ఇరు పక్షాలు సిద్ధమైనప్పుడే, సరైన సమయమని భావించినప్పుడే సరైన ప్రకటన వస్తుందని ఆయన మీడియాతో చెప్పారు.గతేడాది ఫిబ్రవరి 13 నుంచి ఇరుదేశాల మధ్య పలుమార్లు వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిగాయి. కొన్ని విషయాల్లో అంగీకారం కుదరకపోవడంతో ఒప్పందం సాధ్యపడలేదు.చివరిసారిగా డిసెంబర్ 11న భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ చర్చలు తుది దశకు వచ్చాయని, త్వరలోనే ఒప్పందం జరుగుతుందని కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్ ఆనాడు ప్రకటించారు. అయితే ట్రంప్‌తో మోదీ ఫోన్‌లో మాట్లాడనందునే ట్రేడ్ డీల్ జరగడం లేదని లుట్నిక్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితం. ఇదే విషయాన్ని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. గతేడాది నుంచి వివిధ అంశాలకు సంబంధించి మోదీ, ట్రంప్ ఇప్పటివరకు 8 సార్లు ఫోన్‌లో సంభాషించుకున్నారన్నారు. బ్రిటన్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరిన వెంటనే, తదుపరి ఒప్పందం భారత్‌తోనే అని ట్రంప్ స్వయంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు.అయితే వాణిజ్యం విషయంలో భారత్‌కు స్పష్టమైన విధానాలు ఉన్నాయని, ఏ దేశంతోనైనా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు తన సర్వాధికారాన్నీ, స్వతంత్రతను కాపాడుకునే విధంగానే సంప్రదింపులు జరుపుతుందని జైస్వాల్ స్పష్టం చేశారు. ఇక ప్రతీ ఏడాది అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పందాలు జరుగుతూనే ఉంటాయి. భారత్ -అమెరికా మధ్య చర్చలు ఎప్పుడూ నిలిచిపోలేదని అగర్వాల్ అభిప్రాయపడ్డారు. ఇరు పక్షాలు నిరంతరం సంప్రదింపుల్లోనే ఉన్నాయని చెప్పారు. గత ఏడాది డిసెంబర్ చివరి వారంలో వాణిజ్య-పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్‌తో వర్చువల్ సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 10, 11 తేదీల్లో ఉప యూఎస్టీఆర్ రిక్ స్విట్జర్ నేతృత్వంలోని బృందం భారత్ పర్యటన తర్వాత ఈ సమావేశం జరిగింది. జనవరి 12న తన బాధ్యతల స్వీకరణ సందర్భంగా భారత్‌లోని అమెరికా రాయబారి సెర్జియో గోర్, వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ఇరు దేశాలు చురుకుగా పనిచేస్తున్నాయని చెప్పారు.భారత్, అమెరికా మధ్య సంబంధాలు ఉమ్మడి ప్రయోజనాలకే పరిమితం కావని, అత్యున్నత స్థాయిలో బలమైన అనుబంధం ఉందన్నారు.ఇరు దేశాల మధ్య వాణిజ్యం సానుకూల వృద్ధి నమోదు చేస్తోందని చెప్పారు.ఈ ఏడాది మాత్రం ఒప్పందంపై సంతకాలు చేసే విషయంలో జాప్యానికి అమెరికా అనుసరిస్తున్న విధానాలే ప్రధాన కారణమని చెప్పొచ్చు.ముఖ్యంగా చమురు కొనుగోలు విషయంలో భారత్ మొదటి నుంచి ఒక స్పష్టమైన వైఖరిని అవలంబిస్తున్నది. ఎన్నో ఏళ్లుగా మనం రష్యా నుంచే చమురు కొనుగోలు చేస్తూ వస్తున్నాం. కానీ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయవద్దంటూ ట్రంప్ పదేపదే ఆంక్షలతో భారత్‌ను బెదిరింపులకు గురి చేస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు ఇప్పటికే 50 శాతం సుంకాలు విధించిన ట్రంప్ తాజాగా వారితో వ్యాపారం ఆపకపోతే టారిఫ్‌ను 500 శాతానికి పెంచడానికి సిద్ధమవుతున్నట్లు ప్రత్యక్ష హెచ్చరికలకు దిగడం కూడా భారత్, అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం జాప్యానికి కారణంగా నిలిచింది. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని రష్యా ఆపాలనే ఉద్దేశంతోనే ఆ దేశం నుంచి చము రు కొనుగోలు చేస్తున్న దేశాలపై భారీ సుంకాలు విధించేందుకు సిద్ధమవుతున్నట్లు ట్రంప్ తనను తాను సమర్థించుకున్నారు. అంతేకాదు కేవలం సుంకాల విషయంలోనే వారం వ్యవధిలో తాను సంతోషంగా లేనన్న విషయం మోదీకి తెలుసని ఒకసారి, మోదీ నా పట్ల సంతోషంగా లేరంటూ మరోసారి భారత్ పట్ల మాటలు మార్చడం ట్రంప్‌కే చెల్లింది. ఈ నేపథ్యంలో భారత్‌తో ట్రేడ్ డీల్ జరగకపోవడానికి కారణమేంటనే దానిపై అమెరికా ఆత్మవిమర్శ చేసుకోవాలి.

ప్రతిపక్షం
హైదరాబాద్
ఆదివారం
18.01.2026

'పుర' పీఠం.. సర్వేల వ్యూహం!

రాబోయే మున్సిపల్ ఎన్నికలు ఎటు తిరిగి ఎటు వెళ్తాయో అర్థం కాని ఒక అనిశ్చిత పరిస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొంది. పార్టీల సర్వేలు ఒక నాయకుడికి అనుకూలంగా ఫలితాలు చూపిస్తుంటే, క్షేత్రస్థాయిలో ప్రజలు మాత్రం "మా సమస్యలు ఎవరు తీరిస్తే వారికే ఓటు" అని స్పష్టం చేస్తున్నారు. గెలుపు గుర్రాల కోసం అన్వేషిస్తున్న అధిష్ఠానాలకు, టికెట్ ఆశిస్తున్న రెబల్స్ భయం నిద్ర లేకుండా చేస్తోంది.



వెంక గారి భూమయ్య
9848559863

రాష్ట్ర రాజకీయ యవనికపై మరో కీలక ఘట్టానికి తెర లేచింది. గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచ్ ఎన్నికల కోలాహలం ముగిసిందో లేదో, అప్పుడే పట్టణ ప్రాంతాల్లో 'పుర' పోరుకు నగారా మోగింది. ఫిబ్రవరి మొదటి వారంలో మున్సిపల్ కార్పొరేషన్లు, పురపాలక సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. తాజాగా 121 మున్సిపాలిటీలు, 10 మున్సిపల్ కార్పొరేషన్లకు రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఇది కేవలం స్థానిక సంస్థల ఎన్నిక మాత్రమే కాదు; అధికార కాంగ్రెస్‌కు ఇదొక 'ప్రజాభిప్రాయ సేకరణ' అయితే, ప్రతిపక్ష బీఆర్ఎస్ మరియు బీజేపీలకు ఇది తమ ఉనికిని చాటుకునే పోరాటం. గత కొంతకాలంగా రాష్ట్రంలోని మెజారిటీ మున్సిపాలిటీలు ప్రజా ప్రతినిధులు లేక, ప్రత్యేక అధికారుల పాలనలో మగ్గిపోతున్నాయి. బీఆర్ఎస్ హయాంలో నియమించిన పాలకవర్గాల పదవీ కాలం ముగిసిన తర్వాత సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడం పట్టణ ప్రగతిపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ నేపథ్యంలో, రేవంత్ ప్రభుత్వం వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించి, కేంద్రం నుంచి అందాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాబట్టి పట్టణాలను అభివృద్ధి పథంలో నడిపించాలని భావిస్తోంది. ఇప్పటికే 52.42 లక్షల మంది ఓటర్లతో కూడిన తుది జాబితా సిద్ధమైంది. గ్రీన్ సిగ్నల్ రాగానే ప్రక్రియ వేగవంతం కానుంది.

రిజర్వేషన్ల లెక్కలు - సామాజిక సమీకరణాలు

ప్రభుత్వం ప్రకటించిన తాజా రిజర్వేషన్ల ప్రకారం, పట్టణ స్థానిక సంస్థల్లో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారు. 121 మున్సిపాలిటీల్లో బీసీలకు 38 స్థానాలు (31.4%), ఎస్సీలకు 17, ఎస్టీలకు 5 స్థానాలు కేటాయించారు. మిగిలిన 61 స్థానాల్లో 31 మహిళలకు (జనరల్), 30 జనరల్ విభాగాలకు కేటాయించారు. అలాగే 10 ప్రధాన కార్పొరేషన్లలో మేయర్ పదవుల విషయంలో.. ఎస్సీ, ఎస్టీలకు ఒక్కొక్కటి, బీసీలకు 3 స్థానాలు దక్కాయి. విశేషమేమిటంటే, రిజర్వేషన్లలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ 4 మేయర్ స్థానాలను వారికి కేటాయించారు. డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయడం ఈ ఎన్నికల ప్రత్యేకత. ఈ రిజర్వేషన్ల ప్రకటనతో ఆశావహుల జాబితాలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. తమకు అనుకూలమైన వార్డులు రిజర్వ్ అవ్వని నేతలు ఇప్పుడు తమ కుటుంబ సభ్యులను లేదా అనుచరులను రంగంలోకి దించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

వైజ్ఞానిక సర్వేలు - గెలుపు గుర్రాల వేట

మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడూ ఆర్థికంగా, సామాజికంగా భారీ ఎత్తుగడలతో కూడుకున్నవి. అందుకే ఈసారి పార్టీలు కేవలం గత విధేయతకే పరిమితం కాకుండా, అభ్యర్థి యొక్క **'విన్‌బిలిటీ' (గెలిచే అవకాశం)**ను ప్రధానంగా చూస్తున్నాయి. కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికే ప్రైవేట్ ఏజెన్సీలతో క్షేత్రస్థాయి సర్వేలు చేయిస్తోంది. ఏ వార్డులో ఏ సామాజిక వర్గం బలంగా ఉంది, ఏ నాయకుడికి ప్రజల్లో ఆదరణ ఉందో తెలుసుకోవడమే ఈ సర్వేల ముఖ్య ఉద్దేశం. అదే సమయంలో బీఆర్ఎస్ కూడా ప్రతి వార్డులోనూ తనకున్న పాత క్యాడర్ ని బలోపేతం చేసుకుంటూ, కొత్త ముఖాలకు అవకాశం ఇవ్వడం ద్వారా ప్రజల్లో ఉన్న అసహనాన్ని అధిగమించాలని చూస్తోంది. అభ్యర్థుల ఎంపికలో ఆర్థిక బలం, సామాజిక సమీకరణాలు ప్రధాన భూమిక పోషించనున్నాయి. ముఖ్యమంత్రి మంత్రులకు, ఎమ్మెల్యేలకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించారు.



రెబల్స్ బెడద - పార్టీలకు శిరోవేదన

రిజర్వేషన్లు ఖరారు కావడంతో టికెట్ల కోసం ఆశావహుల సందడి మొదలైంది. అయితే గెలిచే వారికే టికెట్లు అని ప్రభుత్వం కరాఖండిగా చెబుతుండటంతో, చాలా మంది సీనియర్లు తమ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు. గత సర్పంచ్ ఎన్నికల్లో సొంత పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన రెబల్స్ వల్ల నష్టం వాటిల్లిన ఉదాహరణలు ఉన్నాయి. ఈసారి అటువంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు ముఖ్యమంత్రి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. అసమ్మతి నాయకులను బుజ్జగించడం, ఒకవేళ వారు తిరుగుబాటు చేస్తే వారిపై తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే పార్టీలు ఒక అవగాహనకు వచ్చాయి. అయినప్పటికీ, తమకు అన్యాయం జరిగిందని భావించే నేతలు స్వతంత్రులుగా బరిలోకి దిగితే ఓట్ల చీలిక ఎవరికి లాభం చేకూరుస్తుందన్నది ఇప్పుడు ప్రధాన చర్చ.

పట్టణ ఓటరు - అభివృద్ధి వర్సెస్ సంక్షేమం

ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆరు గ్యారంటీలు', పట్టణ ప్రాంతాల్లో అమలు తీరు ఈ ఎన్నికల్లో చర్చనీయాంశం కానున్నాయి. ముఖ్యంగా డ్రైనేజీ సమస్యలు, మంచినీటి సరఫరా, కొత్తగా ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతులు ఓటర్ల తీర్పును ప్రభావితం చేస్తాయి. ఇటు బీఆర్ఎస్ కూడా గత తొమ్మిదిన్నరేళ్లలో తాము చేసిన పట్టణ అభివృద్ధిని, ఫ్లై ఓవర్లు, ఐటీ కారిడార్ల విస్తరణను గుర్తు చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. పట్టణ ఓటరు నాడి ఎప్పుడూ విభిన్నంగా ఉంటుంది. మహిళా ఓటర్లు పురుషుల కంటే అధికంగా ఉండటంతో (మహిళలు: 26.80 లక్షలు, పురుషులు: 25.62 లక్షలు), పథకాల లబ్ధి పొందిన మహిళా ఓటర్లే గెలుపోటములను శాసించే అవకాశం ఉంది.

రాజకీయ ప్రకంపనలు ఖాయం!

చివరగా, రాబోయే మున్సిపల్ ఎన్నికలు ఎటు తిరిగి ఎటు వెళ్తాయో అర్థం కాని ఒక అనిశ్చిత పరిస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొంది. పార్టీల సర్వేలు ఒక నాయకుడికి అనుకూలంగా ఫలితాలు చూపిస్తుంటే, క్షేత్రస్థాయిలో ప్రజలు మాత్రం "మా సమస్యలు ఎవరు తీరిస్తే వారికే ఓటు" అని స్పష్టం చేస్తున్నారు. గెలుపు గుర్రాల కోసం అన్వేషిస్తున్న అధిష్ఠానాలకు, టికెట్ ఆశిస్తున్న రెబల్స్ భయం నిద్ర లేకుండా చేస్తోంది. మంత్రులు తమ అనుచరులను గెలిపించుకోవాలని పావులు కదుపుతుంటే, ముఖ్యమంత్రి మాత్రం సర్వేల ఆధారంగానే బిఫారమ్ లు ఇస్తానని సంకేతాలిస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ లోని అంతర్గత విభేదాలు, గత ఎన్నికల ఓటమి ప్రభావం ఎక్కడ పడుతుందో అన్న భయం వేధిస్తోంది. సామాన్య ఓటరు కూడా ప్రస్తుతానికి "వేచి చూసే" ధోరణిలోనే ఉన్నాడు. ఫలితాలు ఎలా ఉన్నా, ఈ 'పుర' పీఠాల పోరు మాత్రం తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ప్రకంపనలు సృష్టించడం ఖాయం. కానీ ప్రస్తుతానికి అంతా సందిగ్ధమే.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

టికెట్ ధరల పెంపు: వినోదమా/దోపిడీయా?



జనక మోహన రావు దుంగ
8247045230

తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల పెరిగిన సినిమా టికెట్ ధరలు కేవలం సామాన్యుడి జేబుకు భారంగా మారడమే కాకుండా, ఒక తీవ్రమైన సామాజిక ఆర్థిక చర్చకు దారితీశాయి. అసలు సినిమా అనేది ఒక ప్రజా వినోద సాధనమా లేక లాభమే పరమావధిగా సాగే వ్యాపారమా? అనే ప్రాథమిక ప్రశ్న ఇక్కడ తలెత్తుతోంది. సినిమా ఒక సృజనాత్మక కళగా పుట్టినప్పటికీ, కాలక్రమేణా భారీ పెట్టుబడులతో కూడిన హైస్టేక్స్ పరిశ్రమగా రూపాంతరం చెందింది. ప్రేక్షకుడికి ఇది రెండున్నర గంటల కాలక్షేపం అయితే, నిర్మాతకు వందల కోట్ల పెట్టుబడికి రెట్టింపు లాభం వెనక్కి తెచ్చే రేసు. ఈ రెండు దృక్పథాల మధ్య సమతుల్యత దెబ్బతిన్నప్పుడే ఈ ధరల వివాదం మొదలవుతోంది.

సమస్య మూలాలు:

భారీ బడ్జెట్ చిత్రాల పేరుతో ధరలను పెంచడాన్ని విశ్లేషిస్తే, ఇక్కడ నాణేనికి రెండు పార్శ్వాలు కనిపిస్తాయి. అంతర్జాతీయ స్థాయి విజువల్స్, భారీ తారాగణాన్ని అందించడానికి వందల కోట్లు ఖర్చు చేస్తున్నామని నిర్మాతలు వాదిస్తారు. ఫలితంగా, పంపిణీదారులు థియేటర్ యాజమాన్యాలు మొదటి పది రోజుల్లోనే ఆ పెట్టుబడిని రాబట్టుకోవాలనే ఒత్తిడికి లోనవుతున్నారు. అయితే, ఒక చేదు నిజం ఏమిటంటే బడ్జెట్‌లు పెరగడానికి ప్రధాన కారణం కేవలం తెరపై కనిపించే "విజువల్ గ్రాండియర్" మాత్రమే కాదు, నటీనటులు, సాంకేతిక నిపుణుల భారీ రెమ్యూనరేషన్లు కూడా. నిర్మాత తీసుకునే ఈ రిస్క్ భారాన్ని నేరుగా ప్రేక్షకులపై మోపడం ఎంతవరకు న్యాయం? భారీ బడ్జెట్ అనేది ప్రతిష్ట కోసం తీసుకునే నిర్ణయం తప్ప, అది ప్రేక్షకుల అవసరం కాదు. అగ్ర హీరోల ఇమేజ్ కోసం సామాన్యుడి జేబుకు చిల్లు పడటం నైతికంగా సమర్థనీయం కాదు. లాభాల్లో సింహభాగం కేవలం నిర్మాత,పంపిణీదారులు నటీనటులు, దర్శకుని చేతుల్లోకి వెళ్తున్నప్పుడు, ఆ ఖర్చును సామాన్య కార్మికుడి కష్టార్జితంతో భర్తీ చేయాలనుకోవడం చర్చించాల్సిన అంశం.

ఈ ధోరణి ఎక్కడ మొదలైంది?

దీనికి ఒక నిర్దిష్ట వ్యక్తిని బాధ్యుడిని చేయలేకపోయినా, 'భారీ చిత్రాలు' సంస్కృతి ద్వారా ఇది టాలీవుడ్‌లోకి ప్రవేశించింది. పాన్‌ఇండియా సినిమాల వెల్లువతో బడ్జెట్ పరిమితులు దాటిపోవడంతో, ప్రభుత్వాల నుండి ప్రత్యేక అనుమతులు తెచ్చుకుని ధరలు పెంచడం ఒక ఆనవాయితీగా మారింది. గతంలో కేటగిరీల వారీగా స్థిరమైన ధరలు ఉండేవి. కానీ ఇప్పుడు అది లాబీయింగ్ ఆధారిత ధరల నమూనాగా మారింది. అగ్ర హీరోలు, దర్శకుల సినిమాలతో మొదలైన ఈ ట్రెండ్ ఇప్పుడు మధ్యస్థ బడ్జెట్ సినిమాలకు కూడా పాకుతోంది.



భారీ బడ్జెట్ అంటేనే గొప్పదా?

ఒక సామాన్య ఉద్యోగి తన కుటుంబంతో కలిసి నెలకు రెండు సినిమాలు చూడలేని స్థితికి చేరుకున్నప్పుడు, ఆ పరిశ్రమ పతనం మొదలైనట్టే. నేడు భారీ బడ్జెట్ పేరుతో జరిగే ఖర్చులో ఎక్కువ భాగం కృత్రిమమైన 'హైప్' సృష్టించడానికే పోతోంది. దీనిని రికవరీ చేయడానికి ధరలు పెంచడం అనేది ప్రేక్షకులపై మోపుతున్న 'బలవంతపు పన్ను' వంటిది. అధిక ధరలు మధ్య తరగతి ప్రేక్షకులను థియేటర్లకు దూరం చేసి ' ఓటిటి ' వైపు మళ్ళిస్తున్నాయి. పైగా మొదటి వారం పెంచే ఈ రేట్ల వల్ల పైరసీ కూడా పెరుగుతోంది. నేడు థియేటర్‌లో టికెట్ దగ్గర నుండి స్నాక్స్ వరకు ప్రతి రూపాయి భారం అవుతోంది. ఇక్కడ ఒక విరుద్ధమైన అంశం ఉంది: నిర్మాతలు విడుదల ముందే డిజిటల్ రైట్స్ ద్వారా వందల కోట్లు పొందుతున్నారు. అలాంటప్పుడు టికెట్ ధరలు తగ్గించి ఎక్కువ మందిని థియేటర్లకు రప్పించే ప్రయత్నం ఎందుకు జరగడం లేదు?

పరిష్కార మార్గం:

ఈ సమస్య పరిష్కారం లేనిది కాదు, కానీ దీనికి పరిశ్రమ మొత్తం మనస్ఫూర్తిగా సహకరించాలి. ముఖ్యంగా నిర్మాణ వ్యయ నియంత్రణలో పారదర్శకత ఉండాలి; ప్రస్తుతం బడ్జెట్‌లో దాదాపు 60 నుండి 70 శాతం కేవలం హీరోలు, దర్శకుల పారితోషికాలకే వెచ్చిస్తుండటం వల్ల ఆ భారం ప్రేక్షకులపై పడుతోంది. దీనికి బదులుగా అగ్ర నటీనటులు 'లాభాల్లో వాటా' పద్ధతికి రావాలి. దీనివల్ల ప్రాథమిక నిర్మాణ వ్యయం తగ్గి, టికెట్ ధరలను పెంచాల్సిన అవసరం ఉండదు. తక్కువ మంది ప్రేక్షకుల నుండి ఎక్కువ వసూలు చేయడం కంటే, తక్కువ ధరతో ఎక్కువ మంది ప్రేక్షకులను థియేటర్లకు చేరవేయడమే వ్యాపారపరంగా లాభదాయకం. అలాగే, ప్రతి థియేటర్‌లో కనీసం 30% సీట్లు సామాన్యులకు అందుబాటులో ఉండేలా అతి తక్కువ ధరకే విక్రయించాలనే నిబంధన ఉండాలి. మరోవైపు 'ఓటిటి' విండోను క్రమబద్ధీకరించాలి. సినిమా విడుదలైన కొద్ది రోజుల్లోనే ఓటిటిలోకి వస్తుందనే నమ్మకం ప్రేక్షకుల్లో ఉంటే వారు అధిక ధర చెల్లించి థియేటర్లకు రారు. కాబట్టి థియేటర్ అనుభవం కోసం ఇచ్చే ధర రీజనబుల్‌గా ఉండి, పరిశ్రమ పెద్దలు తమ విలాసవంతమైన ఖర్చులను తగ్గించుకుని ప్రేక్షకుల ఆర్థిక స్థితిగతులను గౌరవించినప్పుడే ఈ సంక్షోభం గట్టెక్కుతుంది.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)

మౌని అమావాస్యకు ఎందుకు ప్రాధాన్యత?



ఆళవందార్ వేణు మాధవ్
8686051752

సనాతన సంప్రదాయంలో అమావాస్య (అమావాస్య రోజు) ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఏడాది పొడవునా వచ్చే పన్నెండు అమావాస్యలలో, మాఘ మాసంలోని అమావాస్య రోజు అత్యంత పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది. దీనిని మాఘ అమావాస్య లేదా మౌని అమావాస్య అని కూడా పిలుస్తారు.ఈ సంవత్సరం,మాఘ మాసంలో మౌని అమావాస్య ఆదివారం నాడు రావడం వలన మరింత ప్రాముఖ్యత సంతరించుకుంది. ఆదివారం సూర్యభగవానుడి రోజు, తద్వారా ఆధ్యాత్మిక శక్తిని పెంచుతుంది. మౌని అమావాస్య నాడు స్నానం చేయడం,దానం చేయడం,పూజించడం, ధ్యానం చేయడం మనస్సును శుద్ధి చేసుకోవడం సానుకూల ఫలితాలను ఇస్తుందని నమ్ముతారు.ఈ రోజున, ప్రజలు పవిత్ర నదులలో స్నానం చేసి, దానధర్మాలు,పుణ్యకార్యాలు చేస్తారు.ఈ రోజున మౌనంగా ఉండి పూజలు చేయడం వల్ల ప్రత్యేక ఫలితాలు వస్తాయని నమ్ముతారు. అందుకే దీనికి మౌని అమావాస్య అని పేరు పెట్టారు. మౌని అమావాస్య నాడు పవిత్ర నదులలో స్నానం చేయడం,సూర్య భగవానుని ప్రార్థించడం,దానం చేయడం చాలా పవిత్రమైనవిగా భావిస్తారు. గంగా, నర్మద,కృష్ణా,గోదావరి నదుల పవిత్ర జలాలలో స్నానం చేయడం వల్ల పుణ్యం పెరుగుతుంది. ఈ రోజున పేదలకు ఆహారం ఇవ్వడం,తమ శక్తి అనుసారం బట్టలు, దుప్పట్లు, నూనె, పాలు,ధాన్యాలు డబ్బు దానం చేయడం వలన మంచి జరుగుతుంది. జంతువులకు పక్షులకు ఆహారం ఇవ్వడం వల్ల పూర్వీకుల ఆశీస్సులు కూడా లభిస్తాయి.మౌని అమావాస్య నాడు, బ్రహ్మ ముహూర్తం (బ్రహ్మ మాస సమయం) సమయంలో మేల్కొని పవిత్ర నదిలో స్నానం చేయడం ఉత్తమమని భావిస్తారు. నదిలో స్నానం చేయడం సాధ్యం కాకపోతే, స్నానపు నీటిలో గంగా నీటిని కలిపి స్నానం చేయవచ్చు. స్నానం చేసే ముందు, మౌనం పాటించి సూర్య భగవానుడికి ప్రార్థనలు చేయాలి.ఈ రోజున ధ్యానం, జపం, పూజ దానధర్మాలలో ఎక్కువ సమయం గడపడం శుభ ఫలితాలను ఇస్తుంది. ఉపవాసం కూడా ప్రత్యేక పుణ్యాన్ని ఇస్తుంది. మౌని అమావాస్య రోజున సూర్యుడికి అర్ఘ్యం సమర్పించిన తర్వాత, 'ఓం అద్యభూతాయ విద్మహే సర్వసేవాయ ధీమహి, శివశక్తిస్వరూపేణ పితృదేవ్ ప్రచోదయాత్' అనే మంత్రాన్ని 108 సార్లు జపించడం ప్రయోజనకరంగా భా



విస్తారు.. ఇది పితృ దోషం నుండి ఉపశమనం కలిగిస్తుందని జీవితంలో ఆనందం, శాంతి శ్రేయస్సును తెస్తుందని కూడా నమ్ముతారు.

(జనవరి 18 మౌని అమావాస్య)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

పుర పోరుకు రంగం సిద్ధం

- ఖరారైన రిజర్వేషన్లతో రాజకీయ సందడి
- ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎస్సీలకు అయిదు, బీసీలకు ఏడు, జనరల్ కేటగిరికి ఎనిమిది మునిసిపల్ ఛైర్మన్ పదవులు

ప్రతిపక్షం, సిద్ధిపేట బ్యూరో,జనవరి 17:

పుర పోరుకు తొలి ఘట్టం పూర్తయింది. మున్సిపల్ ఛైర్మన్ పదవులకు రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలోని మున్సిపాలిటీలకు ఛైర్మన్ పదవుల రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు శనివారం ఆయా జిల్లాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్లు అధికారికంగా రిజర్వేషన్ల జాబితాను విడుదల చేశారు. రిజర్వేషన్ల జాబితా వెలువడటంతో రాజకీయ సమీకరణలు జోరుగా సాగుతున్నాయి. ఆశావహుల తమ గెలుపు అవకాశాలను బేరీజు వేసుకుని పోటీలో నిలిచేందుకు వ్యూహాలు పన్నుతున్నారు. రిజర్వేషన్లకు అనుగుణంగా గెలుపు అభ్యర్థుల ఎంపికకు రాజకీయ పార్టీలు కసరత్తు మొదలు పెట్టాయి. ఉమ్మడి మెదక్



జిల్లాలో మొత్తం 20 మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో ఐదు మున్సిపాలిటీల ఛైర్మన్ పదవులను ఎస్సీ సామాజిక వర్గానికి, ఏడు మున్సిపాలిటీల ఛైర్మన్ పదవులను బీసీలకు, ఎనిమిది మున్సిపాలిటీల ఛైర్మన్ పదవులను జనరల్ కేటగిరీకి కేటాయించారు. సిద్ధిపేట జిల్లాలో సిద్ధిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీలు ఉన్నాయి. మెదక్ జిల్లాలో మెదక్, నర్సాపూర్, తూప్రాన్ , రామాయంపేట మున్సిపాలిటీలు, సంగారెడ్డి జిల్లాలో కోహీర్, గడ్డపోతారం, ఇంద్రేశం, జిన్నారం,గుమ్మడిదల,జహీరాబాద్, సదాశివపేట, నారాయణఖేడ్, ఆందోలుజోగిపేట, సంగారెడ్డి, ఇస్నాపూర్ మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో ఎస్సీ జనరల్ కేటగిరీకి హుస్నాబాద్, కోహీర్, ఎస్సీ మహిళలకు చేర్యాల, ఇంద్రేశం, గడ్డపోతారం మున్సిపల్ ఛైర్మన్ పదవులు రిజర్వ్ చేశారు. బీసీ జనరల్ కేటగిరీకి జిన్నారం, జహీరాబాద్, గుమ్మడిదల, సిద్ధిపేట, బీసీ మహిళలకు మెదక్, గజ్వేల్, దుబ్బాక మున్సిపల్ ఛైర్మన్ పదవులను కేటాయించారు. జనరల్ కేటగిరీకి నారాయణఖేడ్, ఆందోల్‌జోగిపేట, జనరల్ మహిళలకు సదాశివపేట, సంగారెడ్డి, ఇస్నాపూర్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ ఛైర్మన్ పదవులను రిజర్వు చేశారు. ఛైర్మన్ పదవుల రిజర్వేషన్ల ప్రకటనతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ మరింత ఊపందుకుంది. ఇప్పటికే రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించాయి. రిజర్వేషన్లకు అనుగుణంగా స్థానిక నాయకత్వంలో మార్పులు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై ప్రజల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా 'జాగృతి'

- కవితతో లబ్ధి పొందిన నేతలే ప్రస్తుతం విమర్శించడం సిగ్గుచేటు
- మున్సిపల్ ఎన్నికల్లో తమ సత్తా చాటుతాం
- 42 శాతం రిజర్వేషన్ పేరుతో
- బీసీలకు కాంగ్రెస్ ద్రోహం
- జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 17:



రాష్ట్రంలో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిలకు ప్రత్యామ్నాయంగా తెలంగాణ జాగృతి ఎదుగుతున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ స్పష్టం చేశారు. శనివారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలు యదేచ్ఛగా కొనసాగుతుండగా, గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసినట్లు విమర్శించారు. పార్టీలో ముఖ్య నేతలుగా ఎదిగిన కొందరు అందినంత దోచుకుని కార్యకర్తల సంక్షేమాన్ని విస్మరించినట్లు ఆరోపించారు. అలాగే గత ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలులో విఫలం చెందగా, ప్రజా కోర్టులో వారి చర్యలు ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి సత్తా చాటనుండగా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో తమ పార్టీ దీటుగా రూపుదిద్దుకోనున్నట్లు చెప్పారు. అయితే 42 శాతం రిజర్వేషన్ పేరుతో బీసీలకు కాంగ్రెస్ ద్రోహం తలపెట్టగా, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలను చైతన్యం చేస్తామని అన్నారు.కామారెడ్డి డిక్లరేషన్ అమలయ్యే వరకు తమ పోరాటం ఆగదని, రాష్ట్ర జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు తగిన బడ్జెట్ కేటాయించడంతోపాటు అన్ని రంగాల్లో రిజర్వేషన్ అమలయ్యేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా గతంలో తమ పార్టీ అధినేత కల్వకుంట్ల కవితతో ప్రయోజనం పొందిన వారే ప్రస్తుతం ఆమెను విమర్శిస్తుండడం సిగ్గుచేటని వివరించారు

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో చేపట్టాలి

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 17

హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ రవి *హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టాలని అదనపు కలెక్టర్ నెమురుగొమ్ముల రవి అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలియజేస్తూ శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులచే జాతీయతా భావం పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు, అధికారులు, ఉద్యోగులకు ఉత్తమ సేవాపురస్కారాల విషయంలో ఉత్తమ సేవలు, పారామీటర్స్లో సాధించిన ప్రగతిని ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిపై ప్రసంగ పాఠం తయారు చేసేందుకు నివేదిక వెంటనే సమర్పించాలన్నారు. పోలీసు శాఖ, హనుమకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్, కలెక్టరేట్ల వద్ద వేదిక డెకరేషన్, మార్చ్ ఫాస్ట్, స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం, సీటింగ్ ఏర్పాట్లు, ఆర్ అండ్ బి శాఖ అధికారులు బారికేడింగ్, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలను విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మెడికల్ క్యాంప్ ఏర్పాటు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు జనరేటర్ ఏర్పాటు, మున్సిపల్ శాఖచే విద్యుదీకరణ, త్రాగునీరు, శానిటేషన్, ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి.గణేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రవి, హనుమకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి రాథోడ్ రమేష్, జిల్లా పంచాయితీ అధికారి లక్ష్మి రమాకాంత్, విద్య, వైద్య, విద్యుత్, పోలీసు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశం కొరకు దరఖాస్తుల స్వీకరణ

ప్రతి పక్షం దుబ్బాక జనవరి 17:



రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సాంఘిక, గిరిజన, వెనుకబడిన సంక్షేమ శాఖల సాధారణ గురుకుల విద్యాలయంలో 202627 విద్యా సంవత్సరానికి గాను 5 నుండి 9 వ తరగతి ప్రవేశ పరీక్ష కు ఆసక్తి కలిగి ఉన్న విద్యార్థులు ఈ నెల 21 వ తేదీ వరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని దుబ్బాక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి. సుజాత తెలిపారు.



బి వి కె కాలనీ (BC) లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రతిపక్షం మిరుదొడ్డి జనవరి 17

గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. భూంపల్లి గ్రామం లోని బి వి కే కాలనీ (BC) కాలనీ వాసులు రోడ్డు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు ఆ సమస్యను చైర్మన్ వెంకటయ్య దృష్టికి సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యకు పరిష్కారం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం కాలనీ వాసులందరూ చైర్మన్ వెంకటయ్య అలాగే సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జన్నారెడ్డి, ఉపసర్పంచ్ బాల్శెట్టి అనూష నందం, వార్డ్ సభ్యులు కొండల్,ప్రవీణ్,అక్బర్పేట సర్పంచ్ కుమార్, మాజీ ఎంపీటీసీ ఉల్లెంగల నవ్య నరేష్, బి వి కే కాలనీ వాసులు,గ్రామస్తులు ఇతరులు ఉన్నారు.



వెంకటేశ్వర స్వామి జాతరకు తరలిరండి!

ప్రతిపక్షం,తొగుట, జనవరి 17 :

ఏటా మాఘ అమావాస్య జాతర సందర్భంగా తొగుట మండలం వెంకట్రావుపేట లో ని వాగ్గడ్డ వద్ద జరిగే వెంకటేశ్వర స్వామి జాతర ను విజయవంతం చేయాలని మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి కోరారు. ఆదివారం నిర్వహించే జాతరకు గ్రామ సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్ ఆధ్వర్యంలో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయడంతో పాటు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. జాతర సందర్భంగా ఉదయం 11గంటలకు గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఉత్సవ విగ్రహాన్ని సేవ ద్వారా జాతర వద్దకు తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈ జాతర సందర్భంగా ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ప్రదర్శన ఉంటుంది కావున పెద్ద ఎత్తున ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి జాతరను విజయవంతం చేయాలని కోరారు. జాతర సందర్బంగా గుట్ట వద్ద వెలసిన యోగేశ్వరాలయం, ఎల్లమ్మ, చౌడాలమ్మ, దుర్గమ్మ దేవాలయాలను, దర్గాను కూడా దర్శించుకొనే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. యోగేశ్వరాలయం ఎంతో ప్రసిద్ధిగాంచిందని మూడువైపులా పెద్ద బండలు ఉండగా ఈశాన్యం లోదారి ఉంటుందని వాస్తు రీత్యా ఆలయం కు ఈశాన్యం లోకూడవెళ్లి ప్రవహిస్తుండటంతో వాస్తు రీత్యా ఎంతో ప్రశస్తం చెందిందన్నారు.. ఇక్కడ కొలువు తీరిన యోగేశ్వరుడు భక్తుల పాలిట కొంగు బంగారమై నిలిచాడని పేర్కొన్నారు.. ఈ జాతర కార్యక్రమం సాయంత్రం 4 నుండి రాత్రి 9 వరకు జరుగుతుంది కావున వెంకట్రావుపేట గ్రామ ప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామాల వారు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, మీడియా మిత్రులు తరలివొచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు..

పరకాల మున్సిపల్ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 17



హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిజర్వేషన్ల డ్రా తీసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పరకాల మున్సిపల్ కు సంబంధించిన 22 వార్డు స్థానాలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలు లో పరకాల మున్సిపల్ పరిధిలోని 22 వార్డు స్థానాలకు అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో లాటరీ పద్ధతిన రిజర్వేషన్లకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ డ్రా తీశారు. డ్రా తీసిన వార్డుల రిజర్వేషన్ల జాబితాను కలెక్టర్ ప్రకటించారు. 1వ వార్డు అన్ రిజర్వ్డ్, 2వ వార్డు జనరల్ మహిళ, 3వ వార్డు బీసీ మహిళ, 4వ వార్డు ఎస్సీ మహిళ, 5వ వార్డు బీసీ మహిళ, 6వ వార్డు జనరల్ మహిళ, 7వ వార్డు అన్ రిజర్వుడ్, వార్డు అన్ రిజర్వుడ్, 9వ వార్డు అన్ రిజర్వుడ్, 10వ వార్డు జనరల్ మహిళ, 11 వ వార్డు ఎస్సీ జనరల్, 12వ వార్డు జనరల్ మహిళ, 13వ వార్డు జనరల్ మహిళ, 14వ జనరల్ మహిళ, 15వ వార్డు బీసీ జనరల్, 16వ వార్డు బీసీ జనరల్, 17వ వార్డు ఎస్సీ మహిళా, 18వ వార్డు జనరల్ మహిళ, 19వ వార్డు ఎస్సీ జనరల్, 20వ వార్డు ఎస్టీ జనరల్, 21వ వార్డు ఎస్సీ జనరల్, 22వ వార్డు బీసీ మహిళకు రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. ఈ సందర్భంగా పరకాల మున్సిపల్ కమిషనర్ అంజయ్య గత రిజర్వేషన్లు, ప్రస్తుత రిజర్వేషన్ల కేటాయింపు గురించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నెమురుగొమ్ముల రవి, పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ.వి. శ్రీనివాసరావు, ఆర్పి జయంత్ లాల్, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మణ్, రజనీకాంత్, ప్రవీణ్ కుమార్, సయ్యద్ ఫైజుల్లా, రాజు, వెంకట్, నేహాల్, శ్రీనివాస్, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.



సిద్ధిపేట జిల్లాలో మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి..

- జిల్లా కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 17:

రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక, హుస్నాబాద్, గజ్వెల్ -ప్రజ్ఞాపూర్, చెర్యాల మున్సిపాలిటీలకు సంబంధించిన రిజర్వేషన్ ప్రక్రియను శనివారం ఉదయం ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ (ఐడీఓసీ), సిద్ది పేటలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధ్యక్షతన జిల్లాలోని ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిజర్వేషన్ ప్రక్రియను నిర్వహించారు .ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...రాష్ట్రఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి మున్సిపాలిటీలో 50 శాతం స్థానాలను మహిళలకు రిజర్వేషన్ కల్పించినట్లు తెలిపారు. మహిళా రిజర్వేషన్‌లను డ్రా పద్ధతిలో ఆయా పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ మొత్తం సజావుగా, ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి, సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వ చట్టాలు

- కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో జీపు జాతాను ప్రారంభిస్తున్న సిఐటియు జిల్లా కార్యదర్శి కే.గోపాలస్వామి, కార్మికులు

ప్రతి పక్షం,దౌల్తాబాద్, జనవరి 17:

కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్ చట్టాలు ప్రజల హక్కులను హరించడంతో పాటు రాష్ట్రాల హక్కులను కాలరాసేలా ఉన్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కే.గోపాల స్వామి విమర్శించారు. కేంద్రం తీసుకొచ్చిన పలు చట్టాలు, సవరణ బిల్లులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, రైతు, కార్మిక, వ్యవ సాయ కూలీ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాతాను శనివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో శివాజీ చౌరస్తాలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. లేబర్ కోడ్లు, విబి రాంజీ చట్టం, జాతీయ విత్తన, విద్యుత్తు సవరణ బిల్లుల రద్దుకై దేశవ్యాప్తంగా ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా జనవరి 16 నుండి 18 వరకు జీపు జాత నిర్వహిస్తున్నామని తెలిపారు 19న సిద్దిపేట జిల్లా కేంద్రంలో భారీ ప్రదర్శన సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రాంత ప్రజలు, కార్మికులు, రైతులు,పెద్ద ఎత్తున ఈ పోరాటంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి సిఐటియు మండల కన్వీనర్ ఎస్. లక్ష్మి, కార్మికులు బాలరాజు, దేవకాన్,రాములు రేణుక, లక్ష్మీ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.



లారీ ప్రమాదంలో తండ్రి కొడుకు మృతి

- మిరుదొడ్డి మండలం ధర్మారం లో విషాదం

ప్రతిపక్షం,తొగుట, జనవరి 17 :

లారీ ప్రమాదం తండ్రి కొడుకుల ఉసురు తీసింది. తొగుట మండలంలోని జప్తి లింగారెడ్డి పల్లి ఎక్స్ రోడ్ వద్ద లారీ బైక్ డీ కొట్టడంతో మిరుదొడ్డి మండలం ధర్మారం కు చెందిన తండ్రి కొడుకులు చల్మెడ కుమార చారి (39), ఆయన కుమారుడు సుశాంత్ లకు తీవ్ర గాయాలు కాగా సుశాంత్ అక్కడికక్కడే మరణించగా, కుమార చారిని ఆసుపత్రికి తరలించగా మరణించాడు. కుమార స్వామి కోడలు రమ్యశ్రీ కి కాలు విరిగింది.. ఎదురుగా వెళ్తున్న బైక్ కు లారీ డీ కొట్టడం తో పెను ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది.

ఎట్టకేలకు తేలిన మున్సిపల్ రిజర్వేషన్

- మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ గా బీసీ మహిళ
- నర్సాపూర్.తూప్రాన్. రామాయంపేట. నర్సాపూర్. మున్సిపల్ చైర్ పర్సన్ గా మహిళా జనరల్
- మహిళలకే పెద్ద పీట వేసిన రిజర్వేషన్

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 17 :

ఎన్నోరోజులుగా ఎదురు చూస్తున్నా మున్సిపల్ రిజర్వేషన్లు ఖరారయ్యాయి. జిల్లాలోని మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాల్టీల రిజర్వేషన్లు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఖరారు చేశారు. అన్ని రాజకీయ పార్టీల నేతల సమక్షంలో మహిళా వార్డు స్థానాలను డ్రా విధానంలో ఎంపిక చేశారు. మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ స్థానం బీసీ మహిళలకు కేటాయించారు. జిల్లాలో ఉన్న నాలుగు మున్సిపాలిటీలలో నర్సాపూర్.తూప్రాన్. రామాయంపేట.నర్సాపూర్. మున్సిపల్ చైర్ పర్సన్ గా మహిళా జనరల్.కాగా మెదక్ మున్సిపాలిటీ బీసీ మహిళా జనరల్ గా కేటాయించారు

మెదక్ మున్సిపల్ 32 వార్డుల రిజర్వేషన్ వివరాలు..

మెదక్ మున్సిపాలిటీ

1. ఎస్సీ మహిళా.2. ఎస్టీ జనరల్.3. జనరల్ మహిళ 4.జనరల్ మహిళ.5.జనరల్.6. జనరల్.7.బీసీ మహిళ 8. బీసీ మహిళ.9. జనరల్.10. జనరల్ మహిళ.11. బీసీ మహిళ.12. బీసీ మహిళ.13. ఎస్సి మహిళా.14. మహిళ జనరల్.15. బీసీ జనరల్.16. బీసీ జనరల్.17. జనరల్ మహిళ.18. ఎస్సీ జనరల్.19. జనరల్.20. బీసీ జనరల్ 21. బీసీ మహిళ.22. జనరల్..23. జనరల్ మహిళ 24. బీసీ జనరల్.25. బీసీ జనరల్.26. ఎస్సీ జనరల్ 27. జనరల్ మహిళ.28. జనరల్ మహిళ.29. బీసీ జనరల్ 30. జనరల్.31. జనరల్32. జనరల్ మహిళ

26 సంవత్సరాల తర్వాత బీసీ మహిళా గా మున్సిపల్ చైర్మన్

జిల్లాలో మెదక్ మున్సిపల్ చైర్మన్ గా 26 సంవత్సరాల తరువాత మెదక్ బి.సి. మహిళ కు కేటాయించడం తో మెదక్ లో చైర్మన్ పదవిని ఆశించిన వారు నిరాశ చెందారు.2000 సంవత్సరంలో కాంగ్రెస్ అభ్యర్థిని కొండన్ సావిత్రి మున్సిపల్ చైర్పర్సన్ గా గెలుపొందారు. ఆ తరువాత ఎప్పుడు కూడా మహిళలకు రిజర్వేషన్ లు రాలేవు. మెదక్ మున్సిపల్ చైర్మన్ గా బీసీ మహిళకు కేటాయించడంతో బీసీ వర్గానికి చెందినవారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు

ప్రాంతీయం

జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి

ప్రతిపక్షంమిడిదొడ్డి జనవరి 17



మాఘ అమావాస్యను పురస్కరించుకొని ఆలయాలు ముస్తాబవుతున్నాయి. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల, మిరుదొడ్డి గ్రామాల్లోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాల్లో మాఘ అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని మిడిదొడ్డి అల్వాల గ్రామ సర్పంచులు ఎలుముల మహేశ్వరి దేవరాజ్ ప్రమీల దేవి ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరం మాఘ అమావాస్య రోజున కూడవెల్లి వాగు వద్ద వెలసిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాల వద్ద పూజా కార్యక్రమాలతో పాటు జాతర మహోత్సవం కొనసాగుతుందన్నారు. జాతర మహోత్సవానికి విచ్చేసే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ఆలయ నిర్వాకులు వెల్లడించారు. అల్వాల గ్రామ శివారులోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద ఎడ్లబండ్ల జాతర ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. భక్తులు పరిసర గ్రామాల ప్రజలు జాతర మహోత్సవంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు దీటుగా పోటీ

- **జనసేనా రాష్ట్ర నేత రాధారం రాజలింగం**

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 17:

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా జనసేన పార్టీ ప్రధాన రాజకీయ పార్టీలకు దీటుగా బరిలోకి దిగనుందని గ్రేటర్ హైదరాబాద్ జనసేన అధ్యక్షుడు, ఉమ్మడి మెదక్ జిల్లా ఎన్నికల ఇంచార్జి రాధారం రాజలింగం స్పష్టం చేశారు. సిద్ధిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన జనసేన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.సిద్ధిపేట ప్రెస్‌క్లబ్‌లో జరిగిన జనసేన పార్టీ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాధారం రాజలింగం కు నియోజకవర్గం ఇంచార్జి దాసరి పవన్ గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన రాజలింగం, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. అంతకుముందు పలువురు కార్యకర్తలు జనసేన పార్టీలో చేరగా, వారికి రాజలింగం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్‌కు రెండు తెలుగు రాష్ట్రాలు రెండు కళ్ల వంటివని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంపై పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేకమైన అభిమానం ఉందన్నారు.తెలంగాణ జనసేన కార్యకర్తల అభిప్రాయాల మేరకు, పవన్ కళ్యాణ్ ఆదేశాలతో తెలంగాణలో జనసేన పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తోందని తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలో జనసేన పార్టీ విజయ దుందుభి మోగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ వీరమహిళా రాష్ట్ర చైర్మన్ మండపాక కావ్య, జనసేనా పార్టీ సిద్దిపేట నియోజక వర్గ ఇంచార్జి దాసరి పవన్,జూబ్లీహిల్స్ పిఓసీ మెంబెర్ సానది రమేష్ కుమార్, న్యాయవాది వర్కోలు రాజలింగం, వార్డ్ మెంబెర్ బండిపల్లి జామున, కృష్ణ, సాయి, శివ, పర్శరాములు, మల్లేశం, ప్రశాంత్, రమేష్, నారాయణ రెడ్డి, పాల్గొన్నారు.



అఖిల్ రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యం లో ఉచిత మెగా శిబిరం

ప్రతి పక్షం దుబ్బాక జనవరి 17:

సిద్దిపేట జిల్లా దుబ్బాకలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రమాదాల్లో గాయపడి అందకారంలో ఉన్న నిరుపేదలకు అమెరికా డాక్టర్ల సహాయంతో ఉచిత ప్లాస్టిక్ సర్జరీ చేసేందుకు అఖిల్ రాజ్ ఫౌండేషన్ , లయన్స్ క్లబ్ లు ముందుకు వచ్చినట్టు అఖిల రాజ్ ఫౌండేషన్ అధ్యక్షులు తౌడ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం దుబ్బాక ఎం పి డి ఓ కార్యాలయం ఆవరణలో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. తౌడా సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 25 లోపు ఆధార్ కార్డు తోపాటు గాయంతో ఉన్న ఫోటోలను పోస్టర్‌లో ఉన్న ఫోన్ నంబర్‌కు పంపాలని, డాక్టర్లు సర్జరీకి తేదీ నిర్ణయించినప్పుడు హైదరాబాద్‌కు తీసుకెళ్లి చికిత్సా అందిస్తామని తెలిపారు.ఈ అవకాశాన్ని గ్రామీణ నిరుపేద రోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అఖిల్ రాజ్ ఫౌండేషన్ సభ్యులు ఇనుప రవి, కంకణాల చెంద్రం, మధుసూదన్ రెడ్డి, కమ్మరి నర్సింగ్, బండ నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



తపస్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంఈఓ నీరజ

ప్రతిపక్షం, చేగుంట, జనవరి 17:

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ను చేగుంట మండల విద్యాధికారి నీరజ ఆవిష్కరించారు. చేగుంట జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ముఖ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నీరజ తో పాటు చేగుంట అధ్యక్షులు రావుల వెంకటేష్ కార్యదర్శి తంగళ్ళపల్లి కృష్ణమూర్తి రాజేశ్వర్ చల్లా లక్ష్మణ్ దేశపతి కృష్ణమూర్తి ప్రభాకర్ యాదగిరి శ్రీనివాస్ చరణ్ దాస్ ప్రభాకర్ రెడ్డి శివ కుమార్ శంకర్ బాల్చెట్టి రేఖ కవిత విజయలత రాధ సరస్వతి రమాదేవి శ్రీవాణి భవాని శారద సంధ్యారాణి మంజులత హిమవర్ష సిఆర్పి రమేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ రిజర్వేషన్లు ఖరారు

- **మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజా**

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 17 :

రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ...మున్సిపాలిటీ వార్డుల మహిళా రిజర్వేషన్ ఖరారు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు శనివారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో.. మహిళ .రిజర్వేషన్ ఖరారు ప్రక్రియ ని పారదర్శకం గా కలెక్టర్ నిర్వహించారు జిల్లా లోని మెదక్ మున్సిపాలిటీ లోని 32 వార్డు లు, నర్సాపూర్ మున్సిపాలిటీ లోని 15 వార్డు ల తూప్రాన్ మున్సిపాలిటీలో 16 వార్డులకు రామాయంపేట మున్సిపాలిటీలో 12 వార్డులకు మహిళ రిజర్వేషన్ ఖరారు లో భాగం గా.... మున్సిపాలిటీ లకు సంబందించి ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వార్డుల రిజర్వేషన్ ప్రక్రియ బీసీ ల డెడికేషన్ కమిషన్ ప్రకారం, sc, st లది 2011 జనాభ లెక్కల ప్రకారం, మహిళ రిజర్వేషన్ ను...జీవో 9 ప్రకారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో లాటరీ ద్వారా కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారురాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా రిజర్వేషన్ కేటాయింపులు చేశామని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేసారు.ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ నగేష్, ప్రత్యేక అధికారి సంధ్య,ఆర్డీవోలు , మున్సిపల్ కమిషనర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు

నూతన సర్పంచుల శిక్షణ కార్యక్రమాలకు తప్పక హాజరు కావాలి

కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 17 : మెదక్ జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల ఆర్ట్స్ క్యాంపస్లో సర్పంచుల అవగాహన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పాలనపై పట్టు సాధించే విధంగా ఈనెల 19 నుండి 23 వరకు ఐదు రోజులపాటు 492 మంది సర్పంచులకువిడతల వారీగా శిక్షణ కార్యక్రమాలు.ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.నూతన సర్పంచ్లకు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం పంచాయతీ అధికారాలు, సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, , బాధ్యతలపై, గ్రామసభలు, పంచాయతీ సమావేశాల నిర్వహణను వివరించనున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, ప్రజారోగ్యంపై అవగాహన .కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధుల వినియోగం, చేపట్టనున్న పనులు, పన్నుల వసూళ్లు, సంబంధిత 24 అంశాలపై సుదీర్ఘంగా వివరించనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల మాఘ అమావాస్య జాతరకు పటిష్ట బందోబస్తు

- **బ్రీఫింగ్‌లో సిబ్బందికి కీలక సూచనలు చేసిన జిల్లా అదనపు ఎస్పీ మహేందర్.**

ప్రతిపక్షం, మెదక్ టౌన్ జనవరి 17



మాఘ అమావాస్య సందర్భంగా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం వద్ద స్నానలను ఆచరించే భక్తుల దృశ్య మెదక్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ తెలిపారు.ఈ సందర్భంగా జాతర బందోబస్తు ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని భద్రతా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో మాఘ అమావాస్య విధుల నిర్వహణపై నిర్వహించిన బ్రీఫింగ్‌లో భాగంగా ఏడుపాయల లోని గోకుల్ ఫంక్షన్ హాల్ లో జిల్లా అదనపు ఎస్పీ సిబ్బందికి కీలక సూచనలు చేశారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, భక్తుల రద్దీని క్రమబద్ధంగా నియంత్రించాలని,క్యూ లైన్లు, బారికేడ్ల వద్ద ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. చిన్నపిల్లలు,వృద్ధులు,మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జాతర నిర్వహణను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణం,పరిసర ప్రాంతాలు, ప్రధాన రహదారులపై సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి జాతర మొత్తం నిరంతర నిఘాలో ఉంచినట్లు వివరించారు.భక్తులు పోలీసు సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలని, వాహనాలను కేటాయించిన పార్కింగ్ స్థలాల్లోనే నిలిపి సహకరించాలని కోరారు.మహిళల భద్రత కోసం షీ టీమ్స్, మహిళా పోలీసు సిబ్బంది, మఫ్టీ బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, దొంగతనాలు, గొడవలు వంటి అవాంఛనీయ ఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతర బందోబస్తును మూడు సెక్టార్లుగా విభజించి, జిల్లా ఎస్పీ స్వీయ పర్యవేక్షణలో సుమారు 250 మంది అధికారులు, సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు అధికారులు సూచించిన ప్రదేశాల్లోనే స్నానాలు చేయాలని, లోతట్టు ప్రాంతాలు లేదా ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు.జాతర సందర్భంగా ఏవైనా ఇబ్బందులు ఎదురైతే డయల్ 100 లేదా సమీప పోలీసు సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. భక్తులు పోలీసు సూచనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో అమ్మవారి దర్శనం పూర్తి చేసుకొని సురక్షితంగా తిరిగి వెళ్లాలని జిల్లా అదనపు ఎస్పీ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, సి ఐ. జర్జ్, ఎస్సైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ మున్సిపల్ స్థానాల్లో బీసీలకు న్యాయం

ప్రతిపక్షం మంచిర్యాల జనవరి 17



రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపల్ చైర్మన్ స్థానాలకు టైంలో బీసీలకు అన్యాయం జరిగిందని జాతీయ బీసీ అట్ల పోరాట సమితి నాయకులు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ల స్థానాలు 10 ఉండగా అందులో కేవలం 3 స్థానాలు బీసీలకు కేటాయించడం మున్సిపల్ చైర్మన్ స్థానాలు 121 ఉండగా అందులో కేవలం 38 స్థానాలు బీసీలకు కేటాయించడం పూర్తిగా అన్యాయం అన్నారు జనాభా ప్రాతిపదికన బీసీలు రాష్ట్రంలో 56 శాతం ఉన్నారని తెలిపారు అదే విధంగా దామాషా పద్ధతిలో బీసీ కులస్తులకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో బిసి జాతీయ సంఘ జిల్లా అధ్యక్షులు తుమ్మల శ్రీనివాస్ భీమ్సేన్ చారి భీమ్రావు తదితరులు పాల్గొన్నారు



జిల్లాలో మున్సిపల్ రిజర్వేషన్లు ఖరారు

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 17:

కామారెడ్డి , ఎల్లారెడ్డి, బిచ్కుంద , బాన్సువాడ మున్సిపాలిటీ/కార్పొరేషన్ వార్డుల రిజర్వేషన్లు ఖరారైనట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి జ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. కామారెడ్డి జిల్లా పరిధిలోని నాలుగు మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ ప్రక్రియను శనివారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సాంగ్వాన్ లాటరీ పద్ధతిలో నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకతతో రిజర్వేషన్ ప్రక్రియను చేపట్టినట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ,సంబంధిత అధికారుల సమక్షంలో లాటరీ ప్రక్రియ పూర్తయినట్లు స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలు,మార్గదర్శకాలకు అనుగుణంగా ఖరారు చేయబడ్డాయి. లాటరీ ద్వారా ఖరారైన రిజర్వేషన్ల పూర్తి వివరాలను ప్రభుత్వం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కి నివేదించనున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లు విక్టర్, మధుమోహన్, సంబంధిత మున్సిపల్ అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలి

- **హెల్మెట్ ధరించడం ప్రాణ రక్షణకు అత్యంత అవసరం.**
- **మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు**

ప్రతిపక్షం,మెదక్ టౌన్ జనవరి 17



రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు హెల్మెట్ వినియోగం అత్యంత కీలకమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు శనివారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు.ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది చట్టపరమైన నిబంధన మాత్రమే కాకుండా వ్యక్తిగత భద్రతకు ప్రధాన రక్షణ అని పేర్కొన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల చిన్న ప్రమాదం కూడా తీవ్రమైన గాయాలు లేదా ప్రాణాంతక పరిణామాలకు దారితీస్తోందని అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా రోజువారీగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల విశ్లేషణలో, ఎక్కువగా తలకు గాయాల వల్లే ప్రాణాలు కోల్పోతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయని తెలిపారు. సరైన నాణ్యత గల ISI మార్క్ ఉన్న హెల్మెట్ ధరించడం ద్వారా తలకు గాయాల తీవ్రతను తగ్గించవచ్చని చెప్పారు. వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చునే వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని స్పష్టం చేశారు.ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు “Arrive Alive - 2026” కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాశాలలు, గ్రామాలు, ప్రధాన రహదారులపై అవగాహన సదస్సులు, ఫ్లెక్సీలు, ర్యాలీల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నట్లు వివరించారు.ట్రాఫిక్ నియమాలు పాటించని, హెల్మెట్ ధరించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ చర్యలు శిక్ష కోసం కాకుండా ప్రజల ప్రాణ రక్షణ కోసమేనని స్పష్టం చేస్తూ, ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరించి హెల్మెట్ ను అలవాటుగా మార్చుకొని సురక్షితంగా ప్రయాణించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మున్సిపాలిటీల వార్డు స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు

- **రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా కొనసాగిన ప్రక్రియ**

ప్రతిపక్షం బ్యూరో,నిజామాబాద్, జనవరి 17 :



మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా జిల్లాలోని నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల వార్డు స్థానాలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ రిజర్వేషన్ లు ఖరారు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్సు హాల్ లో అదనపు కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియాలతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించారు. జిల్లాలోని నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలోని 60 డివిజన్ లకు, బోధన్ మున్సిపాలిటీ పరిధిలోని 38 వార్డులు, ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డులు, భీంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డు స్థానాల కోసం ఎస్.సి, ఎస్సీ(మహిళా), ఎస్.టి, ఎస్టీ(మహిళా), బి.సి, బీసీ(మహిళా), అన్ రిజర్వుడు, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీల రిజర్వేషన్లను వీడియో రికార్డింగ్ మధ్యన, నిబంధనలను అనుసరిస్తూ ఖరారు చేశారు.

నిజామాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ లో ఎస్టీ జనరల్ కేటగిరీకి 1 డివిజన్ కేటాయించబడగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి 3 డివిజన్లు, ఎస్సీ మహిళా కేటగిరీకి 2 డివిజన్లు ఖరారయ్యాయని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా బీ.సీ జనరల్ కు 12 డివిజన్లు, బీ.సీ మహిళా కేటగిరీకి 12 డివిజన్లు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 14, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 16 డివిజన్లు రిజర్వ్ అయ్యాయని వివరించారు. బోధన్ మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి 2 వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించబడిందని కలెక్టర్ వెల్లడించారు. బీ.సీ జనరల్ కు 8 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 7 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 8, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 11 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు. ఆర్మూర్ మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి 2 వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించబడిందని కలెక్టర్ వెల్లడించారు. బీ.సీ జనరల్ కు 7 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 7 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 8, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 10 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు.భీంగల్ మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించబడిందని కలెక్టర్ తెలిపారు. బీ.సీ జనరల్ కు 2 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 2, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 4 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు2011 జనాభా ప్రాతిపదికన, బీ.సీ డెడికేషన్ కమిషన్ నివేదికను అనుసరిస్తూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా రిజర్వేషన్ కేటాయింపులు చేశామని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. ఖరారైన రిజర్వేషన్ల వివరాలను ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు నివేదించడం జరుగుతుందని తెలిపారు. రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపల్ కమిషనర్లు జాదవ్ కృష్ణ, శ్రావణి, గంగాధర్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



ప్రాంతీయం

డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం పెద్ద పీఠ



ప్రతిపక్షం, బాన్సువాడ:

రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు పెద్ద పీఠ వేస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బాన్సువాడ పట్టణంలోని పాత వీక్లీ మార్కెట్ (ఇంటిగ్రేటెడ్ మార్కెట్) భవనంలో బాన్సువాడ పట్టణ డ్వాక్రా,మెప్మా మహిళలకు స్వయం ఉపాధిపై అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో డ్వాక్రా మహిళలను ఉద్దేశించి పోచారం మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తోందన్నారు. కుటీర పరిశ్రమల ద్వారా మహిళలు నెలవారీ ఆదాయం సంపాదించి ఆర్థికంగా నిలదొక్కుకుంటారన్నారు. మహిళలను అర్థికంగా బలోపేతంచేయడం కొరకు హైదరాబాద్ లోని ఒక ప్రైవేటు పరిశ్రమను సంప్రదించి ఫుడ్ ప్రాసెసింగ్ యంత్రాలను తీసుకువచ్చి యంత్రాలు పనిచేసే విధానంపై అవగాహన కల్పించారు.మహిళలు తమకు నచ్చిన రంగంలో పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఉదాహరణకు ఆహార పదార్థాలు (ఫుడ్ ప్రాసెసింగ్), అలంకరణ వస్తువులు (కాస్మెటిక్స్) వస్త్రాలు, చేతివృత్తులు,వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చన్నారు.ఇప్పటికే ఇందిరమ్మ క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతలు డ్వాక్రా సంఘాలు విజయవంతంగా నిర్వహిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమాలలో రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ కాసుల బాలరాజు, బాన్సువాడ సబ్ కలెక్టర్ శ కిరణ్మయి,బాన్సువాడ పట్టణ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి కం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు ప్రారంభోత్సవం

- ముఖ్యఅతిథిగా మరో హైకోర్టు న్యాయమూర్తి మాధవి లత.

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్ జిల్లా జనవరి 17



కోర్టు ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తుందని ప్రజలు సుఖ సంతోషంగా ఉండేందుకు కృషి చేస్తుందని హైకోర్టు న్యాయమూర్తి, నారాయణపేట అడ్మినిస్ట్రేటివ్ జడ్జి అనిల్ కుమార్ జూకంటి అన్నారు. శనివారం మక్తల్ లో జూనియర్ సివిల్ జడ్జి కం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా మరో హైకోర్టు న్యాయమూర్తి మాధవి లత తోపాటు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణపేట జిల్లా ప్రజలు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మక్తల్ యజ్ఞస్థలమని గుడ్ గవర్నెన్స్ ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. నారాయణపేట, మక్తల్ మోడల్ కోడ్ కావాలన్నారు. న్యాయమూర్తి మాధవి లతో మాట్లాడుతూ ప్రజలు సంతోషంగా ఉన్నారని కోర్టు అందరికీ న్యాయం చేస్తుందని తెలిపారు. నారాయణపేట జిల్లా శాంతియుతంగా ఉంటుందని కోర్టుకు యువ న్యాయవాదులు రావాలన్నారు. మంచి ప్రాక్టీస్ నేర్చుకోవాలని సాంకేతికంగా ఉపయోగించుకోవాలన్నారు.జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. 2019 ముందు అన్ని రంగాలలో వెనుకబాటుకు గురైన గత రెండు సంవత్సరాలుగా మంత్రి సహాయ సహకారాలతో మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. జిల్లాలో మెడికల్,కళాశాల ఆసుపత్రి, రూ. 200 కోట్లతో సమీకృత పాఠశాల మంజూరు అయ్యాయని తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇల్లు నిర్మాణంలో టాప్ టెన్ లో ఉన్నామని కలెక్టర్ అన్నారు. ఎస్ ఎస్ జి గ్రూపుల సహకారంతో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడంతో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. మక్తల్ లో కోర్టు ఏర్పాటు చేయడం పట్ల కోస్గి నారాయణపేట్ మక్తల్ ప్రజలకు మరింత చేరువైందని కలెక్టర్ తెలిపారు. మక్తల్ జూనియర్ సివిల్ జడ్జి కే. అవినాష్ ఛార్జ్ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్ సేషన్స్ జడ్జి బోయ శ్రీనివాసులు, నారాయణపేట ఇంచార్జీ ఎస్పీ టి. శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్,న్యాయవాదులు దత్తాత్రేయ మక్తల్, దేశాయ్ ప్రకాశ్ రెడ్డి, న్యాయవాదులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల వార్డు స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా కొనసాగిన ప్రక్రియ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 17 :



మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా జిల్లాలోని అందోల్ _ జోగిపేట్ , గడ్డపోతారం, గుమ్మడిదల, ఇంద్రేశం, ఇస్నాపూర్ , జిన్నారం , కోహిర్, నారాయణ ఖేడ్, సదాశివపేట్, సంగారెడ్డి, జహీరాబాద్మున్సిపాలిటీల వార్డు స్థానాలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ రిజర్వేషన్ లు ఖరారు చేయడం జరిగిందని అడిషనల్ కలెక్టర్ మాధురి తెలిపారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో అదనపు కలెక్టర్లు మాధురి, ఇంచార్జ్ అడిషనల్ కలెక్టర్ పాండు తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శనివారం రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించారు.జిల్లాలోని సంగారెడ్డి మునిసిపాలిటీ పరిధిలోని 38 వార్డులకు, అందోల్ జోగిపేట్ మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులు, గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులు, గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డులకు , ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులకు, ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 26 వార్డులకు, జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులకు, కోహిర్ మున్సిపాలిటీ పరిధిలోని 16 వార్డులకు, నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని 15 వార్డులకు, సదాశివ పేట మున్సిపల్ పరిధిలోని 26 వార్డులకు, జహీరాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని 37 వార్డు స్థానాల కోసం ఎస్.సి, ఎస్సీ(మహిళా), ఎస్.టి, ఎస్టీ (మహిళా), బి.సి, బీసీ (మహిళా), అన్ రిజర్వుడు, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీల రిజర్వేషన్లను నిబంధనలను అనుసరిస్తూ ఖరారు చేశారు.సంగారెడ్డి మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి 1 వార్డు కేటాయించబడగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి 3 వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి 2 వార్డులు ఖరారయ్యాయని అడిషనల్ కలెక్టర్ మాధురి తెలిపారు. అదేవిధంగా బీ.సీ జనరల్ కు 7 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు జనరల్ కేటగిరీకి 8 , అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 11 వార్డులు రిజర్వ్ అయ్యాయని వివరించారు. జహీరాబాద్ మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి 2 వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి 2 వార్డు కేటాయించబడిందని ఆమె వెల్లడించారు. బీ.సీ జనరల్ కు 7 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 9, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 10 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు. సదాశివపేట మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి ఒక వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించడం జరిగిందని వెల్లడించారు. బీ.సీ జనరల్ కు 5 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 5 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 6, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 7 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు. ఆందోల్ జోగిపేట్ మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి రెండు వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించబడిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 3 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 3 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 4, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించబడిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 2 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 2 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 4, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 4 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు.ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి 2 వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి రెండు వార్డులు కేటాయించడం జరిగిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 4 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 4 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 6, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 7 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు.జిన్నారం మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి రెండు వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించబడిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 3 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 3 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 4, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు. కోహిర్ మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి రెండు వార్డులు,ఎస్సీ మహిళా కేటగిరీకి రెండు వార్డులు కేటాయించడం జరిగిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 2 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 3, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 5 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు.గడ్డపోతారం మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి రెండు వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించబడిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 3 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 2 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 3, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు.గుమ్మడిదల మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి ఒకటి, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించబడిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 4 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 4 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 5, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు.ఇంద్రేశం మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి మూడు వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి రెండు వార్డులు కేటాయించడం జరిగిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 2 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 3, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు.ప్రతి మున్సిపాలిటీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, అన్‌రిజర్వుడ్ కేటగిరీలకు కేటాయించిన వార్డుల వివరాలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఖరారు చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. మహిళలకు రిజర్వ్ చేసిన వార్డులను డ్రా విధానంలో ఎంపిక చేసి ప్రకటించినట్లు తెలిపారు. రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియలో జెడ్పి సీఈవో జానకి రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు ,గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మొయినాబాద్ మున్సిపాలిటీ రిజర్వేషన్లు ఖరారు

ప్రతిపక్షం,మొయినాబాద్, జనవరి 17:

మొయినాబాద్ మున్సిపాలిటీలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో చైర్మన్ పదవి మరియు 26 వార్డులకు సంబంధించిన రిజర్వేషన్లను అధికారులు అధికారికంగా ఖరారు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ వర్గాలతో పాటు మహిళలకు రిజర్వేషన్లను కేటాయిస్తూ ప్రకటన విడుదల చేశారు. మొత్తం 26 వార్డుల్లో జనరల్‌కు 13, ఎస్సీకి 7, బీసీకి 5, ఎస్టీకి 1 స్థానాన్ని కేటాయించారు. వార్డుల వారీగా రిజర్వేషన్లు ఖరారుకావడంతో మొయినాబాద్ మున్సిపాలిటీలో ఎన్నికల సందడి ప్రారంభమైంది.



వీరశైవ లింగాయత్ మండల అద్యక్షుడిగా శ్రీనివాస్

ప్రతిపక్షం మిరుదొడ్డి, జనవరి 17 :

వీరశైవ లింగాయత్ మండల నూతన కమిటీ అద్యక్షుడిగా పూదూరి శ్రీనివాస్ ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుండిగా రాజమౌళిని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అద్యక్షుడు మాట్లాడుతూ... విషయం ఏమనగా వీరశైవ లింగాయత్ లింగ బలిజ మన మిరుదొడ్డి మండల కమిటీ ఎన్నుకోవడం జరిగిందన్నారు. సిద్దిపేట నుండి మన మలుపల్లికి మన కులస్తులు పెద్దలు వీరశైవ లింగాయత్ లింగ బలిజ పెద్దల సమక్షంలో ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. మండల బందువులందరికి నమస్కారంలు తెలుపుతూ మిరుదొడ్డి మండల కులస్తుల అందరితో కలసి వీరశైవ లింగాయత్ మండల కమిటీ ఎన్నుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. మండలంలో లింగాయత్ సమస్యల పరిస్కారానికి ఎల్లవెళలా కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో నూతన అద్యక్షుడితో పాటు మండల వీరశైవ లింగాయత్ సభ్యులు గాజుల రాజమౌళి, పూదూరి రమేష్, పూదూరి భాస్కర్, పూదూరి వీరభద్రస్వామి, పూదూరి రాజు , పూదూరి వీరేష్, ఆంజనేయులు, పూదూరి కృష్ణ, పూదూరి మహేష్, దినేష్, నరేష్,.పూదూరి సుభాష్, సురేష్. పూదూరి రవి, అజేయ్, కార్తిక్, రఘు , చింటూ తదితరులు పాల్గోన్నారు.

ప్రజావాణి కార్యక్రమం వాయిదా

- తాసిల్దార్ కార్యాలయలలో యధావిధిగా ప్రజావాణి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 17:



మున్సిపాలిటీ ఎన్నికల సన్నహాకా పనులలో అధికారుల నిమగ్నమైనందువల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్ కార్యాలయంతో పాటు నాలుగు మున్సిపల్ ఏరియాలో వాయిదా వేసినట్టు ,జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికల సన్నాహక పనులు ముఖ్యమైన కార్యకలాపాలలో జిల్లా స్థాయి అధికారులు నిమగ్నమై ఉన్న నేపథ్యంలో, ఈ నెల 19 న నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని మెదక్ జిల్లాలోని కలెక్టరేట్ కార్యాలయంతో పాటు నాలుగు మున్సిపాలిటీ ఏరియాలలో ప్రజావాణి తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. మిగతా మండలాలలో తాసిల్దార్ కార్యాలయాల్లో యధావిధిగా ప్రజావాణి కొనసాగుతుందని కలెక్టర్ వెల్లడించారు ఇట్టి విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సహకరించాలని కలెక్టర్ కోరారు.



జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ సత్తా చాటాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 17:

ఈనెల 19 నుంచి 23 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుడివాడలో జరగనున్న స్కూల్ గేమ్స్ జాతీయస్థాయి అండర్-14 బాలికల కబడ్డీ పోటీల్లో తెలంగాణ జట్టు మెరుగైన ప్రదర్శన కనబర్చి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆకాంక్షించారు. పటాన్ చెరులోని మైత్రి మైదానంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన తెలంగాణ బాలికల జట్టుకు ఎమ్మెల్యే స్వంత నిధులతో ట్రాక్ సూట్లు, షూస్, ప్రయాణ ఖర్చులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను స్వతహాగా క్రీడాకారుడినని, క్రీడల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకారం అందిస్తానన్నారు. భవిష్యత్తులో పటాన్ చెరులో జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు శివకుమారి, రవి, మల్లికార్జున, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్కిటెక్చర్ కోర్సు, కెరీర్ అవకాశాలపై అవగాహన

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 17:

ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఆర్కిటెక్చర్ విద్య, కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (జీఎస్ఏ), హైదరాబాద్ ఆధ్వర్యంలో పలు ఔట్ రీచ్ కార్యక్రమాలు నిర్వహించారు. మదీనగూడలోని జెన్ సిస్ ఇంటర్నేషనల్ స్కూల్‌తో పాటు శ్రీ స్వామినారాయణ గురుకుల్, శ్రీ చైతన్య కళాశాలల విద్యార్థులకు ఆర్కిటెక్చరల్ మోడల్స్, డ్రాయింగులు, ప్రదర్శనలు, వర్క్‌షాప్‌ల ద్వారా ప్రాక్టికల్ అవగాహన అందించారు. డిజైన్ ఆలోచనతో పాటు ఆర్కిటెక్చర్‌లో ఉన్న విభిన్న కెరీర్ అవకాశాలను వివరించారు. ఈ కార్యక్రమాలను గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అధ్యాపకులు ఆర్. అభిషేక్ కుమార్ సింగ్, ఆర్. స్నిగ్ధరాయ్ సమన్వయం చేశారు. ఈ ఔట్ రీచ్ కార్యక్రమాలు విద్యార్థులకు కెరీర్ మార్గదర్శనంలో ఉపయోగపడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.



గల్లీ నుంచి ఢిల్లీ వరకు కాషాయ రెపరెపలే లక్ష్యం

- గజ్వేల్ మండల బీజేపీ అధ్యక్షుడు అశోక్ గౌడ్

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 17:

గల్లీ నుంచి ఢిల్లీ వరకు కాషాయ జెండా ఎగరడమే లక్ష్యంగా ప్రతి బీజేపీ కార్యకర్త పనిచేస్తున్నారని గజ్వేల్ మండల బీజేపీ అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ అన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో బీజేపీ విజయడంకా మోగడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వచ్ఛమైన, పారదర్శక పాలనకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర లో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన సందర్భంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పార్టీ శ్రేణులు పటాకులు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు ఉప్పల మధుసూదన్ తోపాటు బిజెపి సీనియర్ నాయకులు ఉప్పల మధుసూదన్, బండారి మహేష్ లు మాట్లాడుతూ దేశ ప్రజలంతా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనకు ఆకర్షితులై బీజేపీకి మద్దతు తెలుపుతున్నారని అన్నారు. తెలంగాణలో అధికార సాధనే లక్ష్యంగా ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగరడం ఖాయమని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సిల్వర్ జనార్ధన్,పెండ్యాల శ్రీనివాస్,మండల ప్రధాన కార్యదర్శి ఇప్ప స్వామి,జిల్లా నాయకులు ఏగొండ,ఆలేటి సుమతి,ఆనంద్ గౌడ ,కర్నాల శ్రీనివాస్, మహేష్ చారి ,ఐల మహేందర్,వెంకట్రాంరెడ్డి,పవన్ కుమార్,అనిల్ బజరంగ్దళ్ ,రమేష్,పవన్ కుమార్,కొన్ని రాజశేఖర్ రెడ్డి,లక్ష్మణ్ రెడ్డి, రవి,మహిళా నాయకురాలుమంతూరి మమత, జీడిపల్లి మధు,రాజేశం,మల్లేశం , రాజు, సాయికుమార్, నరసింహులు, రంజిత్ కుమార్, సంజయ్, స్వామి, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర గోరక్ష సహ ప్రముఖ్ గా గ్యాదరి రాజారాం



ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట జనవరి 17:
విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర గో రక్ష సహ ప్రముఖ్ గా గ్యాదరి రాజారాం నియమితులయ్యారు. ఇటీవల జరిగిన విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలలో రాష్ట్రంలో గోహత్యలు జరగకుండా మరియు గో ఆధారిత వ్యవసాయాలు జరిగేటట్టు చూడ దానికి బాధ్యతలను గ్యాదరి రాజారాం అప్పగించారు. ఈ సందర్భంగా శనివారం గ్యాదరి రాజారాం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గో హత్యలు జరగకుండా గోమాతల వలన ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయో గోవు యొక్క ప్రత్యేకతలను అవగాహన సదస్సు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తూ గోవును కాపాడదానికి నిరంతరం ధర్మ రక్షణ గోవు రక్షణ కోసం కృషి చేస్తానని చెప్పారు.



గ్రామాభివృద్ధియే నా లక్ష్యం

- సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్.

ప్రతిపక్షం,మొయినాబాద్, జనవరి 17 :
గ్రామాభివృద్ధియే నా లక్ష్యమని బాకారం గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని బాకారం గ్రామంలోని 8వ వార్డులో మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులను చేపట్టారు. గతంలో మంచినీటి పైప్ లైన్ పగిలిపోయి నీరంతా బయటకు వచ్చి బురదమయం కావడంతో కాలనీ వాసులు సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. అట్టి సమస్య పరిష్కానికి శనివారం ఆయన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలోని అన్ని వార్డులను దశల వారీగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఎలాంటి సమస్యలు తలెత్తిన తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఏ చిన్న సమస్య ఉన్న దానిని పరిష్కరించేందుకు తన శాయశక్తుల కృషిచేస్తానని వెల్లడించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, నందు తదితరులున్నారు.

ఉద్యమ కళాకారుల హక్కుల కోసం కాంగ్రెస్‌ను నిలదీయాలి

- ఉద్యమ కళాకారుల వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మద్దెల నర్సింలు

సిద్దిపేట, జనవరి 17:



కాంగ్రెస్‌ను ప్రశ్నించకపోతే ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలు రావనీ ఉద్యమ కళాకారుల వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మద్దెల నర్సింలు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ కళాకారులను అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.కొంతమంది స్వార్థపరులైన నాయకులు, కళాకారుల పేరుతో ప్రభుత్వాలను బ్లాక్‌మేయిల్ చేస్తూ ఉద్యమ కళాకారుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం మీద నమ్మకం ఉందంటే నేరుగా సమస్యలను పరిష్కరించుకోవాలే తప్ప, కళాకారులను మభ్యపెట్టడం సరికాదన్నారు. హక్కులు సాధించుకోవాలంటే ఏ ప్రభుత్వాన్నైనా ప్రశ్నించాల్సిందేనని, నాడు కాంగ్రెస్‌ను వ్యతిరేకించినప్పుడే తెలంగాణ సాధ్యమైందని గుర్తు చేశారు. ఈ నెల 20న హైదరాబాద్ ఇంద్రపార్క్ వద్ద నిర్వహించనున్న ఉద్యమ కళాకారుల పోరు దీక్షలో పెద్ద ఎత్తున పాల్గొని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. జై కళాకారుడా – జై తెలంగాణ అని నినదించారు.



మేడారంపై పోలీసుల డేగ కన్ను

- కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించిన మంత్రి సీతక్క
- 450 సీసీ కెమెరాలతో కట్టుదిట్టమైన నిఘా
- భద్రత విషయంలో ఎలాంటి రాజీ వద్దు.

ప్రతిపక్షం, ,ములుగు, జనవరి 17 :
మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర సందర్భంగా శాంతి భద్రతల ఏర్పాట్లపై రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రత్యేక దృష్టి సారించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మేడారంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి, అక్కడి నుంచి కొనసాగుతున్న భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.జాతర ప్రాంతం అంతటా సుమారు 450 సీసీ కెమెరాల ద్వారా పోలీసులు కట్టుదిట్టమైన నిఘా కొనసాగిస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని భారీ ఎల్ ఈడీ స్క్రీన్‌పై జాతర ప్రాంగణంలో జరుగుతున్న కార్యక్రమాలు,భక్తుల రాకపోకలు, జనసాంద్రత పరిస్థితులను మంత్రి సీతక్క ప్రత్యక్షంగా వీక్షించారు.ఈ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరిగితే పోలీసులు ఎలా స్పందిస్తారు,ముందస్తు చర్యలు ,సన్నాహాలు ఏమిటన్న అంశాలను పోలీస్ అధికారులు మంత్రికి వివరించారు.భద్రత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రతి చిన్న అంశాన్ని కూడా అప్రమత్తతతో పర్యవేక్షించాలని మంత్రి సీతక్క పోలీస్ అధికారులకు స్పష్టంగాఆదేశించారు. భక్తులు నిర్భయంగా, ప్రశాంతంగా జాతరలో పాల్గొనేలా భద్రతా ఏర్పాట్లు ఉండాలని,పోలీస్ యంత్రాంగం 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు.శాంతి భద్రతల పరిరక్షణే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్., జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్, ఐటిడిఏ పి ఓ చిత్ర మిశ్రా, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇక నుంచి సంగారెడ్డి నుంచి పోటీ చేయను!

- నిరుపేదల ఇళ్లే సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తా
- జగ్గారెడ్డి రాజకీయ స్పష్టత
- ఎవరిని ఓట్లు అడగను.
- నిర్మల జగ్గరెడ్డి బరిలో ఉంటారు
- ప్రతి పేద కుటుంబంకు 80 గజాల ఇంటి స్థలాల కల్పిస్తా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 17 :
తెలంగాణ రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న సంగారెడ్డి అంటే జగ్గారెడ్డి అనే ఫైర్ బ్రాండ్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్ రెడ్డి @ జగ్గారెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు.నియోజకవర్గం లో ప్రజలకు ఏ కష్టం వచ్చిన "నేనున్నా" అంటూ ముందుండే నాయకుడు, అయన భవిష్యత్ రాజకీయాలపై సంచలన వాక్యలు చేశారు. ఇక పై జీవితంలో సంగారెడ్డి నుండీ తాను ఎమ్మెల్యే గా పోటీ చేయబోనని స్పష్టం చేస్తూ రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తన ఓటమి పై జగ్గారెడ్డి తీవ్ర భవోద్వేగానికి లోనయ్యారు. తన గెలుపు కోసం స్వయంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వచ్చి ప్రచారం చేసినా స్థానిక ప్రజలు నన్ను ఓడించారు. ఆయనను ఇక్కడికి పిలిపించి అవమానించానేమో అని నా మనసులో చాలా బాధగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. రాహుల్ గాంధీ వంటి పెద్ద నాయకుడి ఇమేజ్ తన ఓటమి వలన మచ్చ పడిందేమోనని భావిస్తున్నాను అంటూ తన ఆవేదన వ్యక్తం చేశారు. తన ఓటమి పై కారణాలు విశ్లేషస్తూ, నియోజక వర్గ మేధావులపై జగ్గారెడ్డి విమర్శలు చేశారు. సంగారెడ్డి అభివృద్ధి కి, ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకున్నప్పటికి ఇక్కడి మేధావులే తనను ఓడించడంలో ప్రధాన పాత్ర పోషించారని అయన ఆరోపించారు. క్షేత్రస్థాయిలో తాను చేసిన సాయం కంటే, మేధావుల ఆలోచనా ధోరణి తనను దెబ్బ తీసిందని అయన అభిప్రాయం వ్యక్తం చేశారు. పేదాలతో ఏర్పాటు చేసిన ముఖా ముఖిలో నియోజకవర్గం నిరు పెదలందరికి ఇంటి స్థలాలు కల్పించి వారి కుటుంబలల్లో వెలుగులు తేవడమే లక్ష్యంగా పని చేస్తానని టి పి సిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. శనివారం సంగారెడ్డి పట్టణం లోని గంజీ మైదాన్ లో ఏర్పాటు చేసిన పేదలతో ముఖా ముఖి. గతంలో ఇండ్ల పట్టాలు కల్పించిన మరియు లేని వారితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో టిజిఐసిసి చెర్మెన్ నిర్మల జగ్గారెడ్డి ప్రత్యేక ఆహ్వాని తురాలుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20122013 లో ఇంటి పట్టాలు కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. అందులో లేని వారికి కూడా ఇంటి స్థలాలు కల్పించటం జరుగుతుందన్నారు. మున్సిపాల్ కమిషనర్ ఓ తేది తెలుపటం జరుగుతుందని అందరు దరఖాస్తు లు చేసుకోవాలని సూచించారు. జగ్గారెడ్డి మాటలు రాజకీయాల్లో మరోసారి చర్చకు దారి తీస్తున్నాయి. నిరుపేదల ఇళ్ల సమస్యను కేంద్రబిందువుగా చేశారు. పేదలకు ఇండ్లు కల్పించడమే తన జీవిత లక్ష్యమని స్పష్టం చేస్తూనే, తాను సంగారెడ్డి నుంచి ఎన్నికల్లో పోటీ చేయనని రాజకీయ స్పష్టత ఇచ్చారు.ఇకపై ఓట్లు కూడా అడగనని చెప్పడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతున్నాయి, కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమామే ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుందన్నారు. 2012-13లో ఇళ్ల పట్టాలు పొందిన వారితో పాటు ఇప్పటికీ స్థలం లేని పేదలకు ఇంటి జాగ కల్పించడమే తన ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.తాను కూడా 22 సంవత్సరాలు కిరాయి ఇంట్లోనే జీవించిన అనుభవం ఉందని, అందుకే కిరాయి ఇళ్ల బాధ తనకే ఎక్కువగా తెలుసని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2013లో అప్పటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డితో చర్చించి సంగారెడ్డిలోని 5,500 మంది పేదలకు 80 గజాల చొప్పున ఇంటి స్థలాలు ఇప్పించేందుకు కృషి చేశానని గుర్తుచేశారు. అయితే ఆ స్థలాలను బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఇతర అవసరాలకు వినియోగించారని ఆరోపించారు. పదేళ్ల కాలంలో పేదలు తమకు ఇచ్చిన స్థలాలపై ఎందుకు ప్రశ్నించలేదని ప్రజలను ప్రశ్నించారు. ఐన పేదలకు న్యాయం చేయడానికే సంగారెడ్డి, కంది మండలాల్లో 200 ఎకరాల భూసేకరణకు సిద్ధమయ్యామని చెప్పారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్‌తో చర్చించామని, జనవరి నుంచే ప్రక్రియ ప్రారంభించి నవంబర్ నాటికి ఒక కొలిక్కి తీసుకొస్తానని స్పష్టం చేశారు.ఓటర్లు పని చేసే నాయకులు గూర్చి ఆలోచించాలన్నారు.వెయ్యి రూపాయల నోటు కోసం, క్వార్టర్ మద్యం కోసం జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. నేడు పేదలు సంగారెడ్డిలో నెలకు రూ.5,000 ఇంటి కిరాయి చెల్లిస్తే ఏడాదికి రూ.60 వేలు, పదేళ్లకు రూ.6 లక్షల నష్టం జరుగుతుందని వివరించారు. ఓట్లు వేసే సమయంలో అప్పుడే సరైన నిర్ణయం తీసుకుని ఉంటే ఈ డబ్బు మిగిలేదని వ్యాఖ్యానించారు.తన రాజకీయ ఓటమిపై ఎప్పుడూ బాధపడలేదని, అదే తన భార్య నిర్మల జగ్గారెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడానికి కారణమైందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అధికారంలో ఉందని, సీఎం రేవంత్ రెడ్డి తన మాట వింటారని ధీమా వ్యక్తం చేస్తూ, సంగారెడ్డిలో ఇల్లు లేని ప్రతి పేదవాడికి 80 గజాల ఇంటి స్థలం ఖచ్చితంగా ఇస్తానని హామీ ఇచ్చారు. మొత్తంగా ఈ వ్యాఖ్యలు కేవలం రాజకీయ ప్రకటనలుగా కాకుండా, పేదల ఇళ్ల సమస్యపై ప్రభుత్వ బాధ్యతను గుర్తు చేస్తున్నాయని పేర్కొన్నారు. భూసేకరణ, జరుగగానే మళ్లి మీతోసమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లక్కీ డ్రా పేరుతో మోసాలు

ప్రతిపక్షం, హైదరాబాద్, జనవరి 17 :
బెట్టింగ్ యాప్‌ల మోసాలపై ఉక్కుపాదం మోపి తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఎక్స్ వేదికగా మరోసారి కీలక హెచ్చరిక జారీ చేశారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లపై కఠిన చర్యలతో ఆ దందాకు దాదాపు బ్రేక్ పడటంతో, ఇప్పుడు కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు "లక్కీ డ్రా" పేరుతో కొత్త మోసాలకు తెరలేపుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్లు, బైకులు, ఖరీదైన గ్యాడ్జెట్లు ఇస్తామంటూ అమాయక ప్రజలను ఆకర్షించి నగదు దోచుకుంటున్న ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు.



సోషల్ మీడియా వేదికగా అమాయకుల మోసం :
ఇటీవల సామాజిక మాధ్యమాల్లో లక్కీ డ్రా పేరుతో జరుగుతున్న మోసాలపై పోలీసులకు అనేక ఫిర్యాదులు అందుతున్నాయని సజ్జనార్ అన్నారు. కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, సెలబ్రిటీలు తమ ఫాలోయింగ్‌ను ఉపయోగించి "డ్రాలో పాల్గొంటే కచ్చితంగా బహుమతి" అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. వాస్తవానికి ఈ డ్రాలకు ఎలాంటి చట్టబద్ధత లేకపోవడం, బహుమతులు అందకుండా ప్రజలు మోసపోవడమే జరుగుతోందని స్పష్టం చేశారు.

లక్కీ డ్రాలు కాదు - ఇది నేరమే :
లక్కీ డ్రా పేరుతో డబ్బులు వసూలు చేయడం, ప్రజలకు లాభాల ఆశ చూపించి మోసం చేయడం నేరమని సీపీ సజ్జనార్ స్పష్టంగా చెప్పారు. ఈ తరహా కార్యకలాపాలు ది ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ (బ్యానింగ్) యాక్ట్, 1978 కింద నేరంగా పరిగణించబడతాయని పేర్కొన్నారు. చట్టాన్ని అతిక్రమించి లక్కీ డ్రాలు నిర్వహించే వారిపై, వాటిని ప్రమోట్ చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని తీవ్రంగా హెచ్చరించారు.

సెలబ్రిటీ అయినా సరే ఉపేక్ష లేదు :
తాము ప్రసిద్ధులమన్న అహంకారంతో ప్రజలను మోసం చేస్తే ఎవరినీ వదిలిపెట్టబోమని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ తేల్చి చెప్పారు. సెలబ్రిటీలైనా, సోషల్ మీడియా స్టార్లైనా, యూట్యూబర్లు లేదా ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయెన్సర్లైనా చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేశారు. పాపులారిటీని అడ్డం పెట్టుకుని అమాయకుల ఆశలను దోపిడీ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :
లక్కీ డ్రాలు, ఈజీ మనీ, భారీ బహుమతుల ప్రకటనలు చూసి ప్రజలు మోసపోవద్దని సీపీ సజ్జనార్ సూచించారు. "డబ్బులు చెల్లిస్తే కార్లు, బైకులు వస్తాయి" వంటి హామీలు ఎక్కువగా మోసాలేనని, అలాంటి ప్రకటనలను నమ్మకూడదని సూచించారు. ఏదైనా డ్రా లేదా స్కీమ్‌లో పాల్గొనే ముందు దాని చట్టబద్ధతను పరిశీలించాలని, అనుమానం కలిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మోసాలపై కఠిన చర్యల దిశగా పోలీసులు :
బెట్టింగ్ యాప్‌ల మోసాలపై ఇప్పటికే తీసుకున్న చర్యల మాదిరిగానే, లక్కీ డ్రాల ముసుగులో జరిగే మోసాలపై కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు సజ్జనార్ వెల్లడించారు. సోషల్ మీడియాను గమనిస్తూ, అక్రమ ప్రమోషన్లపై ఆధారాలు సేకరించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అవసరమైతే ఆర్థిక లావాదేవీలను కూడా లోతుగా విచారిస్తామని స్పష్టం చేశారు.

సమాజ బాధ్యతగా మారాల్సిన అప్రమత్తత :
లక్కీ డ్రాల మోసాలు కేవలం వ్యక్తిగత నష్టం మాత్రమే కాకుండా, సమాజాన్ని దెబ్బతీసే అంశమని సజ్జనార్ తెలిపారు. అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని, మోసాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజల అప్రమత్తతే ఇలాంటి నేరాలకు చెక్ పెట్టే ఆయుధమని వివరించారు.

కార్మిక ప్రదర్శన సభను విజయవంతం చేయాలి

- సిఐటియు రైతు,వ్యవసాయ కార్మిక సంఘాలు

ప్రతిపక్షం, ఇల్లందకుంట, :



ఈనెల 19 తేదీన పెద్ద ఎత్తున జిల్లా కేంద్రంలో కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక రైతు వ్యవసాయ కూలీ,ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాలు మహా కార్మిక ప్రదర్శన,సభ చేపట్టినట్లు తెలిపారు.గత 11 సంవత్సరాలుగా కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాయడమే కాక రాష్ట్రాల హక్కులను హరిస్తూ చట్టాలను చేసిందని,ఒక వైపున ప్రజా సంక్షేమం వల్లిస్తూనే 11 సంవత్సరాల పాలనలో కార్పొరేట్ సంస్థలకు 16 లక్షల కోట్ల రాయితీలు ఇచ్చిందని చివరికి ప్రభుత్వ రంగ సంస్థలను ఆదానీ,అంబానీ వంటి బడా పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నదన్నారు.ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్ మాట్లాడుతూ....దేశ సంపదలో 1991 లో ఒక్క శాతం ఆస్తులు కలిగిన వారు ఇప్పుడు ప్రస్తుతం 162 కుటుంబాలు 25 శాతం దేశ సంపదను కలిగి ఉన్నారని,లక్షల కోట్లు మొండి బకాయిలుగా బ్యాంకులకు రుణపడి ఉన్నారని,ప్రస్తుత నాలుగు లేబర్ కోడ్స్ వల్ల మరిన్ని వేల కోట్లు సంపాదించుకోవడానికి కార్మికుల వాస్తవ జీవన ఆదాయం తగ్గించడానికి మాత్రమే ఈ లేబర్ కోడ్స్ ఉపయోగపడతాయని,29 చట్టాల స్థానంలో తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ పార్లమెంట్లో ఉపసంహరించుకునే వరకు సమైక్య ఉద్యమం కొనసాగుతుందని,2025 విద్యుత్ సవరణ చట్టం ద్వారా విద్యుత్ ఛార్జీలు కేంద్రం విద్యుత్ రెగ్యులర్ కమిషన్ ద్వారా నిర్ణయిస్తుందని,స్మార్ట్ మీటర్లు పెట్టి టారిఫ్ రెట్లు ముందుగానే వసూలు చేస్తారని,ఉచిత విద్యుత్తు రద్దు చేస్తారని,క్రాస్ సబ్సిడీ రద్దు అవుతుందని,విదేశాల నుండి విద్యుత్ దిగుమతి చేసుకొని రాష్ట్రాల హక్కులను పూర్తిగా తొలగించి కార్పోరేట్ సంస్థలకు ఉత్పత్తి, సరఫరా పంపిణీ వ్యవస్థలను అస్తవస్తం చేసుకుని లక్షల కోట్ల లాభాలు సంపాదించుకోవడానికి ఈ విద్యుత్ సవరణ చట్టాన్ని రూపొందించారని,కాబట్టి దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము మాట్లాడుతూ.... వామపక్షాల పోరాటాల ఫలితంగా 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ గ్యారెంటీ చట్టం వల్ల అనేకమంది దళితులు గిరిజనులు ఉపాధి పొందుతున్నారు.ఈ చట్ట మార్పు చేయడమే కాక రాష్ట్రాలు 10 శాతం నుండి 40 శాతం భరించాలని అనేక రాష్ట్రాల హక్కులను హరించి వేయడం జరుగుతున్నదని,సమైక్య పోరాటం ద్వారా ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని,పట్టణ ప్రాంతాలకు కూడా విస్తరించి పేద కార్మిక కుటుంబాలకు రక్షణ కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్,జిల్లా ఉపాధ్యక్షులు మారెళ్ళ శ్రీలత,తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుండేటి వాసుదేవ్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాయికంటి శ్రీనివాస్,తిప్పరబోయిన శ్రీకాంత్,మల్లయ్య,రమేష్, కుమార్,సారయ్య, ఐలయ్య, ఎల్లయ్య,సాగర్, పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీతో డీకే భేటీ



కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ న్యూఢిల్లీలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గేతో భేటీ అయ్యారు. దీంతో కర్ణాటకలో నాయకత్వ మార్పుపై సాగుతున్న ఊహాగానాలకు మరోసారి రెక్కలు వచ్చాయి. రాహుల్‌గాంధీతో ముఖాముఖీ చర్చలు జరిపిన శివకుమార్ అనంతరం ఖర్గేతో విడిగా సమావేశమైనట్లు వర్గాలు వెల్లడించాయి. చర్చల వివరాలను కాంగ్రెస్ పార్టీ అధికారికంగా వెల్లడించలేదు. అయినప్పటికీ కర్ణాటకలో రాజకీయ పరిస్థితి, ప్రభుత్వంలో అంతర్గత సమన్వయం, నాయకత్వ మార్పుపై సాగుతున్న ఊహాగానాలపైనే ప్రధానంగా చర్చలు జరిగినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల డీకే శివకుమార్ బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు, ఢిల్లీలో కర్ణాటక కాంగ్రెస్ సీనియర్ నాయకులు జరిపిన సమావేశాల నేపథ్యంలో జరిగిన భేటీలకు రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. అయితే కర్ణాటక రాజకీయాలతోపాటు వివిధ రాష్ట్రాలలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సంస్థాగత చర్చలలో కూడా డీకేఎస్ పాల్గొన్నారు. అదే సమయంలో కర్ణాటక ఇంధన మంత్రి కేజే జార్జి ఢిల్లీలో రాహుల్‌ను కలుసుకోవడం విశేషం

విశ్వ వీక్షణం



మహారాష్ట్రలో రిసార్ట్ రాజకీయాలు

బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికలు ముగిసి ఫలితాలు ఇలా వెలువడ్డాయో లేదో.. అలా ఫైవ్‌స్టార్ హోటల్ రాజకీయాలు మొదలయ్యాయి. కూటమిగా పోటీ చేసినా వెన్నుపోటు పొడుస్తారన్న భయం ఏర్పడటంతో దేశంలోనే అతి పెద్ద కార్పొరేషన్‌పై నాయకత్వ ఆధిపత్యం కోసం ప్రయత్నాలు పారంభమయ్యాయి. కొత్తగా ఎన్నికైన తమ పార్టీ కార్పొరేటర్లందరూ బాంద్రాలోని ఫైవ్‌స్టార్ హోటల్‌కు రావాలని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, శివసేన చీఫ్ ఏక్‌నాథ్ షిండే ఆదేశించారు.ఇతర పార్టీల వారు తమ కార్పొరేటర్లతో బేరసారాలు జరపకుండా, ప్రలోభాలకు గురి చేయకుండా వారందరినీ తన వద్ద ఉంచుకునేందుకు షిండే ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, శివసేన కలిసి మహాయుతి కూటమిగా పోటీ చేశాయి. అయితే కూటమిలో బీజేపీ తర్వాత 29 సీట్లతో శివసేన అతిపెద్ద పార్టీగా నిలిచింది. తమ పార్టీ సహకారం లేకుండా బీఎంసీ మేయర్ స్థానం దక్కించుకునే అవకాశం బీజేపీకి లేకపోవడంతో, బీజేపీ సహా ఇతర పార్టీల వారు ఎలాంటి అవకాశం తీసుకోకుండా ఆయన తన పార్టీ కార్పొరేటర్లందరినీ ఐక్యంగా ఉంచాలని ఫైవ్‌స్టార్ హోటల్‌కు వారిని తరలించారు. మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ పాగా వేసింది. ముంబైలో మూడు దశాబ్దాల శివసేన ఆధిపత్యానికి గండిపడింది. రాష్ట్రంలోని 29 కార్పొరేషన్లలో 25 చోట్ల బీజేపీ గెలుపొందింది ఈ ఎన్నికల్లో ఎన్సీపీ కూటమికి ఎదురుదెబ్బ తగిలింది. అజిత్‌పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ, శరద్‌పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎస్పీ) తొలిసారి ఈ ఎన్నికల్లో కలిసి పోటీచేశారు. సంప్రదాయంగా తమకు పట్టున్న ప్రాంతంలో కూడా వీరు ఈ ఎన్నికల్లో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోలేకపోయారు. 24 మున్సిపాల్టీలలో ఎన్సీపీ (ఎస్పీ) కనీసం ఖాతా కూడా తెరవలేక పోయింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం పాలైనా స్వల్ప ఊరట లభించింది. రాష్ట్రంలోని నాలుగు మున్సిపాల్టీలలో ఏకైక అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించగా, ఐదు కార్పొరేషన్లలో రెండో అతిపెద్ద పార్టీగా నిలిచింది. మహారాష్ట్ర అంతటా మజ్లిస్ పార్టీకి 125 స్థానాలు లభించాయి.ముంబై, జనవరి 17 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఐదుగురు అభ్యర్థులు జైలులోనుంచి గెలుపొందారు. వీరు పుణె, షోలాపూర్, జల్గావ్, జాల్నా మున్సిపాలిటీల్లో పోటీచేశారు. గెలుపొందిన నేరచరితుల్లో గ్యాంగ్‌స్టర్ల బంధువులు, గౌరీలంకేశ్ హత్య కేసులో నిందితుడు కూడా ఉన్నారు. గ్యాంగ్‌స్టర్ సూర్యకాంత్ అలియాస్ బందు అందేకర్ కోడలు సోనాలి, మరదలు లక్ష్మి పుణె కార్పొరేషన్‌కు ఎన్నికయ్యారు. వీరిద్దరూ తమ మనవడి హత్య కేసులో జైలులో ఉన్నారు. జర్నలిస్ట్ గౌరీలంకేశ్ హత్య కేసులో నిందితుడు శ్రీకాంత్ పంగారర్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు

ప్రతిపక్షం
Prathipaksham.in





చలికాలంలో కీళ్ల నొప్పులకు చెక్..

చలికాలం (రాగానే చాలా మందిని వేధించే ప్రధాన సమస్య కీళ్ల నొప్పులు . ఉష్ణోగ్రతలు తగ్గినప్పుడు కీళ్ల చుట్టూ ఉండే కండరాలు బిగుసుకుపోవడం, రక్త ప్రసరణ మందగించడం, వాతావరణ పీడనంలో మార్పుల కారణంగా ఈ నొప్పి మరింత తీవ్రమవుతుంది. అయితే సరైన జాగ్రత్తలు, ఆహార నియమాలు, తేలికపాటి వ్యాయామాల (Light Exercise) ద్వారా ఈ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. చలికాలంలో కీళ్ల నొప్పుల ఉపశమనానికి 5 ప్రభావవంతమైన చిట్కాల గురించి కొన్ని విషయాలు ఈ ఆర్టికల్‌లో తెలుసుకుందాం.

డీహైడ్రేషన్ వద్దు:

కీళ్ల నొప్పులకు ప్రధాన కారణాలలో ఒకటి డీహైడ్రేషన్ . చలికాలంలో దాహం తక్కువగా అనిపించినా.. శరీరం నీటిని కోల్పోతూనే ఉంటుంది. కీళ్లలో ఉండే సైనోవియల్ ద్రవం) కీళ్లు సున్నితంగా కదలడానికి సహజ కందెన లాగా పనిచేస్తుంది. నీరు తగినంతగా తాగకపోతే ఈ ద్రవం తగ్గిపోయి, కీళ్ల మధ్య ఘర్షణ పెరిగి, నొప్పి, బిగుతు పెరుగుతాయి. అందుకని రోజంతా క్రమం తప్పకుండా గోరు వెచ్చని నీరు (Lukewarm Water) తాగడం వల్ల సైనోవియల్ ద్రవం సరిగా ఉత్పత్తి అయ్యి కీళ్ల నొప్పి, వాపు తగ్గుతాయి, కండరాలు రిలాక్స్ అవుతాయి.

పోషకాహారం:

కీళ్ల నొప్పి తగ్గించడంలో.. ఎముకలు, కీళ్లను బలోపేతం చేయడంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలున్న ఆహారాలు శరీరంలోని మంటను తగ్గిస్తాయి. అందుకు నువ్వులు, బెల్లం బాదం, వాల్‌నట్‌లు, వేరుశనగలు, పసుపు కలిపిన పాలు ఆకుపచ్చ కూరగాయలు, సోయా, కాయధాన్యాలు (Lentils). ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్లు (Omega3 Fatty Acids) అధికంగా ఉండే అవిసె గింజలు, ఆలివ్ నూనె వంటివి కూడా వాపును తగ్గించడంలో సహాయపడతాయి. అంతేకాకుండా శీతల పానీయాలు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, వేయించిన చిరుతిళ్లు, అధికంగా మసాలాలు ఉన్న ఆహారం, అలాగే కొందరు నిపుణుల సలహా ప్రకారం బంగాళాదుంపలు, టమాటాలు, చిక్కుళ్ళు వంటి లెక్టిన్లు అధికంగా ఉండే పదార్థాలను



పరిమితం చేయాలి.

విటమిన్ డి:

చలికాలంలో సూర్యరశ్మి (Sunlight) తక్కువగా లభించడం వల్ల చాలా మందిలో విటమిన్ డి (Vitamin D) లోపం ఏర్పడుతుంది. విటమిన్ డి అనేది కాల్షియంను (Calcium) శరీరం శోషించుకోవడానికి, ఎముకలను బలంగా ఉంచడానికి చాలా అవసరం. దీని లోపం కండరాల బిగుతు, కీళ్ల నొప్పిని పెంచుతుంది. ప్రతిరోజూ కనీసం అరగంట పాటు సూర్యరశ్మిలో నడవడం లేదా కూర్చోవడం ద్వారా శరీరంలో విటమిన్ డి స్థాయిని పెంచుకోవచ్చు. తీవ్రమైన లోపం ఉన్నవారు డాక్టర్ సలహా మేరకు సప్లిమెంట్లను తీసుకోవడం మంచిది.

తేలికపాటి వ్యాయామం:

చలికి భయపడి ఇంట్లోనే ఉండటం, శారీరక శ్రమను తగ్గించడం వల్ల కీళ్లు మరింత బిగుసుకుపోతాయి. అందుకే కీళ్లకు మద్దతు ఇచ్చే కండరాలను బలోపేతం చేయడానికి, కీళ్లలో రక్త ప్రసరణను మెరుగుపరచడానికి తేలికపాటి వ్యాయామాలు అవసరం. వాకింగ్, యోగా, తేలికపాటి స్ట్రెచింగ్‌లు, ఇండోర్ వ్యాయామాలు. నొప్పి లేని పరిమితుల్లో శరీరాన్ని కదిలించడం ద్వారా సైనోవియల్ ద్రవం కీళ్లలోకి చేరి.. బిగుతు తగ్గుతుంది. కీళ్లపై ఎక్కువ భారం పడని ఈత వంటివి కూడా మంచి ఎంపిక. వ్యాయామం ప్రారంభించే ముందు తప్పకుండా వామప్ చేయాలి.

వేడి చికిత్స-మసాజ్:

నొప్పి ఉన్న ప్రాంతానికి వేడిని అందించడం అనేది తక్షణ ఉపశమనాన్ని ఇచ్చే పద్ధతి. దీనిని హీట్ థెరపీ అంటారు. వెచ్చని గుడ్డ లేదా వేడి నీటి సంచిని నొప్పి ఉన్న చోట 10 15 నిమిషాలు ఉంచడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడి, కండరాలు రిలాక్స్ అయ్యి, నొప్పి తగ్గుతుంది. అంతేకాకుండా ఆవాలు, కొబ్బరి లేదా నువ్వుల నూనెను కొద్దిగా గోరు వెచ్చగా చేసి నొప్పి ఉన్న కీళ్లపై సున్నితంగా 10 నిమిషాలు మసాజ్ చేయడం ద్వారా కీళ్ల బిగుతు తగ్గి.. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. మసాజ్ తర్వాత ఆ ప్రాంతాన్ని వెచ్చని దుస్తులతో కప్పి ఉంచడం మంచిది.

బరువు నియంత్రణ-వెచ్చని దుస్తులు:

చలికాలంలో చాలామంది ఎక్కువగా తినడం వల్ల బరువు పెరుగుతారు. అధిక బరువు ముఖ్యంగా మోకాలు, తుంటి వంటి బరువు మోసే కీళ్లపై ఒత్తిడిని పెంచుతుంది.. ఇది నొప్పిని తీవ్రతరం చేస్తుంది. అందుకే ఆహారంపై శ్రద్ధ పెట్టి ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడం చాలా ముఖ్యం. బయటకు వెళ్ళేటప్పుడు శరీరాన్ని పూర్తిగా వెచ్చని దుస్తులతో కప్పి ఉంచాలి. ముఖ్యంగా నొప్పి ఉన్న కీళ్ల భాగాలను వెచ్చని బ్యాండ్లు లేదా గ్లౌజులతో కప్పుకోవడం ద్వారా చల్లటి గాలి తగలకుండా చూసుకోవాలి. ఇది నొప్పి పెరగకుండా నిరోధిస్తుంది. పైన పేర్కొన్న చిట్కాలు ఉపశమనాన్ని అందిస్తాయి.. అయినప్పటికీ కీళ్ల నొప్పి తీవ్రంగా ఉంటే లేదా దీర్ఘకాలంగా కొనసాగితే.. అది రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి ఇతర ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చు. కాబట్టి తప్పకుండా వైద్యుడిని సంప్రదించి.. సరైన రోగ నిర్ధారణ, చికిత్స తీసుకోవడం అవసరమని నిపుణులు చెబుతున్నారు.





నలుగురు మావోయిస్టులు మృతి

మావోయిస్టులు, 'భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో శనివారం చోటుచేసుకుంది. బీజాపూర్ జిల్లా నార్త్‌వెస్ట్ రీజియన్ పరిధిలోని అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్టీఎఫ్), జిల్లా రిజర్వు గార్డ్స్(డీఆర్‌జీ), కోబ్రా బలగాల సంయుక్త ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వారికి మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన బలగాలు ఎదురుకాల్పులకు దిగడంతో ఇరువర్గాల మధ్య సుమారు గంటన్నరపాటు భీకర పోరు జరిగినట్టు తెలిసింది.జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు అక్కడి నుంచి తప్పించుకున్నారు. తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని గాలింపు చర్యలు చేపట్టగా.. ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలతోపాటు ఒక ఏకే47, ఇతర ఆయుధ, వస్తు సామగ్రి లభించింది. మృతుల్లో ఒకరు డివిజనల్ కమిటీ సభ్యుడు, నేషనల్ పార్క్ ఏరియా దళ కమాండర్ దిలీప్ బెజ్జా, ఏరియా కమిటీ మెంబర్ కోసా మాండవిగా పోలీసులు గుర్తించారు. ఎదురుకాల్పుల ఘటనతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం ఆ ప్రాంతంలో మరిన్ని భద్రతా బలగాలను మోహరించి గాలింపు చర్యలను ముమ్మరం చేసింది.



ఇరాన్ అల్లర్లకు ట్రంపే కారణం..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నిరసనలకు మద్దతిచ్చిన ట్రంప్‌ను నేరస్థుడిగా పరిగణిస్తున్నామన్న ఆయన.. ఇరాన్‌లో ఆందోళనలకు, ప్రాణ నష్టానికి ఆయనే కారణమని ఆరోపించారు. ఇటీవల చోటుచేసుకున్న ఆందోళనల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఖమేనీ తొలిసారి ప్రస్తావించారు.''ఇటీవల ఆందోళనల వెనుక అమెరికా కుట్ర దాగుంది. ఇరాన్‌ను అణచివేయడం, ఆధిపత్యం చలాయించడం వారి లక్ష్యం. ఆందోళనల వేళ అమెరికా అధ్యక్షుడు స్వయంగా వ్యాఖ్యలు చేస్తూ నిరసనకారులకు మద్దతు ప్రకటించారు. అందుకే ఆయన్ను నేరస్థుడిగా పరిగణిస్తున్నాం. నిరసనల్లో పాల్గొన్నవారు అమెరికా కోసం పనిచేసిన వారే. విద్యా సంస్థలు, ప్రార్థనా మందిరాలను ధ్వంసం చేశారు. ఎంతో మందిని గాయపరిచారు'' అని సుప్రీం లీడర్ ఖమేనీ పేర్కొన్నారు.ఆందోళనకారులు విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న మందుగుండు సామగ్రిని వినియోగించారని ఖమేనీ ఆరోపించారు. యుద్ధం వైపు దేశాన్ని తీసుకెళ్లాలని అనుకోవడం లేదన్నారు. నేరస్థుల్లో విదేశీయులూ ఉన్నారన్నారు. నేరస్థులెవరినీ విడిచిపెట్టబోమని, కేసులను కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.ఆందోళనల్లో పాల్గొన్న వారిలో దాదాపు 800 మందికి ఇరాన్ మరణ శిక్ష అమలు చేస్తుందనే వార్తలు వచ్చాయి. అమెరికా హెచ్చరికల నేపథ్యంలో గల్ఫ్ దేశాలు జోక్యం చేసుకోవడం తదితర పరిణామాల తర్వాత ఇరు దేశాలు వెనక్కి తగ్గినట్లు కనిపించింది. ఈ నేపథ్యంలో ఖమేనీ స్పందిస్తూ అమెరికాపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరోవైపు ఇరాన్ హింసాత్మక ఘటనల్లో ఇప్పటి వరకు 3వేలకు పైగా మరణించినట్లు అంతర్జాతీయ నివేదికలు వెల్లడించాయి.



టీమ్ఇండియా థ్రిల్లింగ్ విక్టరీ..

అండర్ 19 వరల్డ్‌కప్‌లో యువ భారత్ వరుసగా రెండో విజయాన్ని సాధించింది. బులవాయో వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 18 పరుగుల తేడాతో టీమ్ ఇండియా గెలిచింది. తొలుత భారత్ 48.4 ఓవర్లలో 238కి ఆలౌటైంది. అనంతరం డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో బంగ్లా టార్గెట్‌ను 29 ఓవర్లలో 165 పరుగులకు లక్ష్యాన్ని కుదించారు. ఈ ఛేదనలో బంగ్లా 23.3 ఓవర్లలో 146 పరుగులతో ఆలౌటైంది. విహాన్ మల్హోత్ర 4 వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించాడు.అభిజ్ఞాన్ కుందు (80; 112 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సలు), వైభవ్ సూర్యవంశీ (72; 67 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సలు) రాణించారు. కనిష్క్ చౌహాన్ (28) ఫర్వాలేదనిపించాడు. ఆయుష్ మాత్రే (6),వేదాంత్ త్రివేది (0)నిరాశపర్చడంతో ఆరంభంలోనే భారత్ 12 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. బంగ్లాదేశ్ బౌలర్లలో ఫహద్ 5, ఇక్బాల్ 2, హకీమ్ తమీమ్ 2, పావెజ్ జిబోన్ ఒక వికెట్ పడగొట్టారు.మరోవైపు, భారత్ బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బంగ్లాలో హిందువులపై దాడుల నేపథ్యంలో ఆ దేశంలో దౌత్య సంబంధాలు దెబ్బ తిన్నాయి. ఈ కాంట్రవర్సీ క్రికెట్ దాకా వచ్చింది. దీంతో ఇరుదేశాల మధ్య వివాదం రోజురోజుకూ ముదురుతోంది. ఈ క్రమంలో తాజా మ్యాచ్‌లో టాస్ సమయంలో బంగ్లా కెప్టెన్ జవేద్ అబ్రార్‌తో టీమ్ఇండియా కెప్టెన్ ఆయుశ్ మాత్రే షేక్ హ్యాండ్ ఇవ్వలేదు.ఇదిలా ఉండగా, బంగ్లా పేస్ బౌలర్ ముస్తాఫిజుర్‌ను బీసీసీఐ ఐపీఎల్ నుంచి తప్పించింది. బోర్డు ఆదేశాల మేరకు వేలంలో ముస్తాఫిజుర్‌ను కొనుగోలు చేసిన కోల్‌కతా ఫ్రాంచైజీ అతడిని జట్టులోంచి రిలీజ్ చేసింది. దీంతో ప్రతి చర్యగా వచ్చే నెలలో భారత్ వేదికగా జరగనున్న టీ20 వరల్డ్‌కప్‌లో ఆడేందుకు బంగ్లాదేశ్ జట్టును ఇక్కడికి పంపేందుకు బీసీబీ నిరాకరిస్తోంది. భారత్‌లో కాకుండా శ్రీలంకలో తమ మ్యాచ్‌లు ఆడేలా రీ షెడ్యూల్ చేయాలని ఇటీవల ఐసీసీకి విజ్ఞప్తి చేసింది. దీనిపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది. అయితే ఈ వ్యవహారంపై ఐసీసీ ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.



మంధాన మెరుపులు.. ఢిల్లీపై ఆర్‌సీబీ విజయం

మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) వరుస విజయాలతో దుమ్మురేపుతున్నది. ఎదురైన ప్రత్యర్థినల్లా ఓడిస్తూ టాప్‌గేర్‌లో దూసుకెళుతున్నది. శనివారం జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ 8 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘన విజయం సాధించింది. ఢిల్లీ నిర్దేశించిన 167 పరుగుల లక్ష్యాన్ని ఆర్‌సీబీ 18.2 ఓవర్లలో 169/2 స్కోరు చేసింది.కెప్టెన్ స్మృతి మంధన(61 బంతుల్లో 96, 13ఫోర్లు, 3సిక్సలు) మెరుపు అర్ధసెంచరీతో చెలరేగగా, జార్జియా వోల్(54 నాటౌట్) ఆకట్టుకుంది. కాప్(1/21), నందని(1/34) ఒక్కో వికెట్ తీశారు. తొలుత ఢిల్లీ 20 ఓవర్లలో 166 ఆలౌటైంది. షెఫాలీవర్మ(62), హామిల్టన్(36) ఆకట్టుకున్నారు. బెల్(3/26),సత్ఘరె(3/27) మూడేసి వికెట్లు తీశారు.



ప్రతిపక్షం
www.prathipaksham.in
10
హైదరాబాద్
ఆదివారం
18.01.2026
సినిమా




రైటింగ్ పవర్‌తో బాక్సాఫీస్ షేక్

నవీన్ పొలిశెట్టి చిత్ర రంగంలో ఎలా ఎదిగాడు? అన్నది చెప్పాల్సిన పనిలేదు. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఎంట్రీ ఇచ్చి ఇంతింతై వటుడింతైన చందంగా ఎదిగాడు. క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా పరిచయమై హీరోగా ప్రమోట్ అయిన మరో ప్రతిభా వంతుడు. నేరుగా బాలీవుడ్ నే టార్గెట్ చేసి అక్కడే స్థిరపడాలనుకున్నాడు. అక్కడ ఎన్నో ప్రయ త్నాలు చేసి చివరికి సొంత పరిశ్రమ టాలీవుడ్ కి చేరుకున్నాడు. ఇక్కడా అవకాశాలు కోసం కాళ్లు అరిగిలే తిరిగాడు. కానీ కష్టేఫలి అని నమ్మిపని చేసాడు. దీంతో 'లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్' లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా పరిచయ మవ్వడం.. అక్కడ నుంచి నవీన్ హీరోగా ఎదిగిన సన్నివేశం తెలిసిందే.ఈ ప్రోసస్ లో తనని తానే స్టార్ గా మలుచుకున్నాడు అన్నది అంతే వాస్తవం. కేవలం నటనకు మాత్రమే పరిమితకాకుండా రైటింగ్ విభాగంలోనూ తన మార్క్ పడేలా చూసుకున్నాడు. నవీన్ హీరోగా నటించిన 'ఏజెంట్ సాయి శ్రీనివాస్ ఆత్రేయ' స్రీన్ ప్లే లో భాగమయ్యాడు. స్వరూప్ ఆర్ .ఎస్. జె దర్శకత్వం వహించిన బ్యాకెండ్ లో నవీన్ చాలా గ్రౌండ్ వర్క్ చేసాడు. 4 కోట్ల బడ్జెట్ లో నిర్మించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద 20 కోట్ల వసూళ్లను సాధించింది. ఆ తర్వాత నటించిన 'జాతిరత్నాలు' తో మంచి విజయాన్ని అందుకున్నాడు. అనుదీప్ దర్శకత్వం వహించిన రైటింగ్ లో తన హస్తం కూడా ఉందని నవీన్ తాజా ప్రకటనతో అర్థమవుతుంది. 6 కోట్ల బడ్జెట్ లో నిర్మించిన సినిమా 70 కోట్ల వసూళ్లను సాధించింది. ఆ తర్వాత నటించిన 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'తోనూ యావరేజ్ హిట్ అందుకున్నాడు.ఈ సినిమాలో అనుష్క పక్కన నటించే అరుదైన అవకాశం దక్కింది. ఈ సంక్రాంతి సందర్భంగా రిలీజ్ అయిన 'అనగనగనగా ఒక రాజు'తోనూ మంచి విజయం అందుకున్నాడు. 'మన శంకర వరప్రసాద్ గారు' తర్వాత ఈ సినిమాకు మంచి టాక్ వస్తోంది. ఈ సినిమా స్టోరీ విభాగంలోనూ నవీన్ కీలక పాత్ర పోషించాడు. అయితే ఈ సినిమా రిలీజ్ కు ముందే తాను ఏ సినిమా చేసినా ఆ కథల్లో వేళ్ళు పెడతానంటూ పబ్లిక్ గానే ప్రకటించాడు. సాధారణంగా నటులు రైటింగ్ విభాగంలో ఇన్వాల్వ్ అయితే క్రియేటివ్ డిఫరెన్సెస్ తలెత్తుతాయి. సినిమా సక్సెస్ కి కూడా తక్కువ అవకాశాలుంటాయనే ఆరోపణ లున్నాయి. కానీ నవీన్ ఇన్వాల్వ్ అయిన ప్రతీ సినిమా మంచి విజయం సాధించిందే. ఇంత వరకూ ఏ సినిమా వైఫల్యం చెందలేదు. రిలీజ్ లు ఆలస్య మైనా? పక్కా కాన్ఫిడెంట్ సబ్జెక్ట్ తోనే నవీన్ అండ్ కో బరిలోకి దిగి హిట్ కొడుతుంది.

అసలైన మహిళామణిని తట్టి లేపుతోన్న తాప్సీ!



స్టార్ హీరోయిన్ ఓ సినిమాకు సైన్ చేసిందంటే కోట్ల రూపాయలు ఖాతాలో జమ అవుతాయి. ఏ నటికి జయాపజయాలతో సంబంధం ఉండదు. సినిమాకు నష్టం వచ్చినా? లాభం వచ్చినా? భరించాల్సింది నిర్మాత మాత్రమే. అందులోనూ నేటి జనరేషన్ హీరోయిన్లలో నిర్మాత లాభాల గురించి ఆలోచించే హీరోయిన్లను వెళ్ల మీద లెక్క పెట్టవొచ్చు. సినిమా సక్సెస్ ని ..ఫెయిల్యూర్ ని బాధ్యతగా తీసుకునేది అతి కొద్ది మందే. సినిమాలపై..పోషించే పాత్రల పై ఎంత ఫ్యాషన్ ఉన్నా? అప్పు డప్పుడు తమ అధీనంలో లేకుండానే కొన్ని తప్పిదాలు జరిగిపోతుంటాయికానీ ఇలాంటి చిన్నపాటి తప్పిదాలు గానీ, పారితోషికం ఆశించి గానీ, ఏ రోజు పనిచేయలేదంటోంది తాప్సీ. ఇండస్ట్రీలో ఎదురైన అనుభవాల నుంచి తాను తెలుసుకున్న విషయాలను అమ్మడు పంచుకుంది. పరాజయాలు , మనో వేదనలు ఎదురైన తర్వాతే ఏ దారిలో నడవాలో తెలుసుకున్నట్లు పేర్కొంది. మనసు పూర్తిగా ఏకీభవించిన చిత్రాల్లో ఉత్తమంగా రాణించగలనని .. అలాంటి కథలే ప్రేక్షకులకు బలంగా కనెక్ట్ అవుతాయని గ్రహించానంది.కానీ ఇలాంటి చిన్నపాటి తప్పిదాలు గానీ, పారితోషికం ఆశించి గానీ, ఏ రోజు పనిచేయలేదంటోంది తాప్సీ. ఇండస్ట్రీలో ఎదురైన అనుభవాల నుంచి తాను తెలుసుకున్న విషయాలను అమ్మడు పంచుకుంది. పరాజయాలు , మనో వేదనలు ఎదురైన తర్వాతే ఏ దారిలో నడవాలో తెలుసుకున్నట్లు పేర్కొంది. మనసు పూర్తిగా ఏకీభవించిన చిత్రాల్లో ఉత్తమంగా రాణించగలనని .. అలాంటి కథలే ప్రేక్షకులకు బలంగా కనెక్ట్ అవుతాయని గ్రహించానంది.అప్పటి నుంచి తన అంతరాత్మ చెప్పినట్లే వింటున్నానంది. బ్యాంక్ బ్యాలెన్స్ పెంచుకోవాలంటే ఇప్పటికే చాలా సినిమాల్లో నటించి కోట్ల రూపాయలు వెనకేసేదాన్ని అంది. తనలోని నటనా సామర్థ్యం పెంచే పాత్రలపైనే దృష్టి పెట్టి పని చేస్తున్నానంది. ఎవరు నడవని కొత్త మార్గంలో నడ వాలనుకుంటున్నానంది. రిస్క్ ఉన్నా సరే తీసుకోవడానికి తానెప్పుడు సిద్ధంగానే ఉంటానంది. తనలో ఉన్న అస లైన స్త్రీకి నచ్చే చిత్రాల్లో మాత్రమే పని చేస్తానంది. జీవితం పట్ల తన దృక్పథం చాలా వరకూ ఓ మహిళా కోణం నుంచే ఉంటుందంది. ఇవన్నీ ఎన్నో వైఫల్యాల తర్వాత వచ్చిన అనుభవాలుగా పేర్కొంది. కెరీర్ ఆరంభంలో ఉన్న త స్థానానికి చేరుకోవా లంటే ఎంచుకున్న పాత్రలే ఆస్థానంలో కూర్చోబెడతాయని కొందరు చెప్పారంది.కానీ వాటిలో చాలా వరకూ తాను చేసిన ఏ పాత్రలు వర్కౌట్ అవ్వలేదంది. అందుకు కారణం తన జడ్జిమెంట్ కంటే ఇతరులు జడ్జిమెంట్ కి ప్రాధాన్యం ఇవ్వడం ఓ కారణమంది. అప్పటి నుంచి వేరే వాళ్ల మాటలు వినకుండా సొంతంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపింది. అలా కథల ఎంపిక మొదలు పెట్టి నాటి నుంచి కెరీర్ లో మార్పు మొదలైందని తెలిపింది. అలాగే ట్రెండ్ గురించి ఎప్పుడూ పట్టించుకోనంది. ట్రెండ్ అన్నది కొన్ని నెలల పాటే కొనసాగు తుందని..ఆ తర్వాత మరో కొత్త ట్రెండ్ మొదలవుతుందంది. ఇలా ట్రెండ్ పట్టుకుని సినిమాలు చేయడం అన్నది దండగ అనేసింది తాప్సీ



షర్ట్ లేకుండా రామ్ చరణ్..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా చేస్తున్న లేటెస్ట్ మూవీ పెద్ది. సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా ఈ ఏడాది మార్చి 27వ తేదీన రిలీజ్ కాబోతుందట.ఈ మేరకు ఇప్పటికే సినిమా బృందం అనౌన్స్ చేసింది. ఈ మూవీలో రామ్ చరణ్ హీరోగా చేస్తుండగా బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్ హీరోయిన్ గా మెరువనున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన అప్డేట్స్ అన్ని జనాలను ఆకట్టుకున్నాయి. సినిమా కూడా బంపర్ హిట్ అవుతుందని అందరు అంచనా వేస్తున్నారు. చాలా రోజుల నుంచి హిట్ కోసం రాంచరణ్ కూడా ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే.బుచ్చిబాబు దర్శకత్వంలో వస్తున్న పెద్ది సినిమా కోసం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ చాలా కష్టపడుతున్నాడు. నిద్ర లేకుండా కూడా వర్క్ చేస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాలో కొన్ని పార్ట్స్ మళ్ళీ రీ షూట్ కూడా చేయబోతున్నారట. అందుకే రామ్ చరణ్ చాలా ఫోకస్ గా ఉన్నారని నడుస్తోంది. ఇలాంటి నేపథ్యంలో రామ్ చరణ్ కు సంబంధించిన కొత్త లుక్స్ వైరల్ గా మారాయి. ఇందులో షర్ట్ లేకుండానే రాంచరణ్ మెరిసాడు. జిమ్ లో వర్కౌట్స్ చేస్తూ బిజీగా ఉన్న రామ్ చరణ్ ఫోటోలు ఇప్పుడు వైరల్ గా మారాయి. ఈ ఫోటోలు చూసిన ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. కాగా పెద్ది సినిమా స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో వస్తున్న సంగతి తెలిసిందే.

శ్రీలీల వెరీ సీరియస్..



ఉన్న పళంగా శ్రీలీల బాలీవుడ్ కి ఎందుకు వెళ్లింది? అవకాశాలు వచ్చినా, తీసుకున్న అడ్వాన్సులు కూడా వెనక్కి ఇచ్చేసి మరీ హిందీ సినిమాల వైపు మళ్లింది? అమ్మడిలో ఈ సడెన్ ఛేంజ్ చూసి అభిమానులు సహా ప్రేక్షకులు షాక్ అయ్యారు. తెలుగు అవకాశాలను వదులకుని బంగారంలాంటి భవిష్యత్ ను నాశనం చేసుకుంటుందనే ఊహగానాలు వ్యక్తమయ్యాయి. దీనికి కారణంగా బాలీ వుడ్ లో స్థిరపడాలి... భవిష్యత్ ని అక్కడే నిర్దేశించుకుని ముందుకు సాగుతుందని అతా అనుకున్నారు. కానీ అసలు కారణం అది కాదు. తెలుగు సినిమాల్లో నటిస్తే తనకు ప్యూచరే ఉండదని అమ్మడు ముందుగానే గెస్ చేసి బాలీవుడ్ కి వెళ్లినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.వివరాల్లోకి వెళ్తే టాలీవుడ్ లో శ్రీలీల ఇంకా పూర్తి స్థాయిలో హీరోయిన్ గా స్థిరపడలేదు. కెరీర్ ని ఇంకా నిర్మించుకునే ప్రయత్నాల్లోనే ఉంది. కొన్ని సినిమాల్లో హీరోయిన్ గా నటించిన ఆ పాత్రాలు తనలో మాస్ కోణాన్ని హైలైట్ చేసాయి తప్ప హీరోయిన్గా ఐడెంటిటీని తీసుకురాలేదన్నది కాదనలేని నిజం. అదే సమయంలో ఐటం పాటల్లో కూడా నటించింది. దీంతో గ్లామర్ పాత్రల్లో అవకాశాలు పుంజుకుంటున్నాయి. అప్పటికే కొన్నిసినిమాల్లో గ్లామర్ గా కని పించడం..'పుష్ప 2' లో ఐటం పాట ఆటలో అలరించడం తెలిసిందే. దీంతో ఆ తరహా పాత్రలు టాలీవుడ్ లో ఊపందుకున్నాయి.అలాగని హీరోయిన్ అవకాశాలకు దూరం కాలేదు. అమ్మడు ఎంత ప్రయత్నిస్తున్నా? మెయిన్ లీడ్ కి ప్రమోట్ అవ్వడం లేదు. సెకెండ్ లీడ్ లోనే దర్శకులు తీసుకుంటున్నారు. ఇదే కొనసాగితే భవిష్యత్ లో ఇంకా కింద స్థాయి పాత్రలే పోషించాల్సి ఉంటుంది. గ్లామర్ డాల్ గానే ప్రేక్షకుల్ని కలకాలం అలరించాల్సి ఉంటుంది. వీటన్నింటి అమ్మడు మైండ్ లో రివైండ్ చేసుకుని కెరీర్ లో ఇంత వరకూ తానెంత సక్సస్ అయింది? సాధించాల్సింది ఏంటి? ప్రస్తుతం టాలీవుడ్ లో తాను ఎలాంటి స్థానంలో కొనసాగుతుంది? ఇవన్నీ కూలంకుశంగా విశ్లేషించుకుంది.దీంతో భవిష్యత్ మొత్తం కళ్ల ముందు కనిపించింది. అదే సమయంలో టాలీవుడ్ లో సినిమాలు చేయ కూడదని, బలమైన నిర్ణయం తీసుకుంది. దీంతో వచ్చిన హీరోయిన్ అవకాశాలు సైతం వదలుకుని బాలీవుడ్ సినిమాలకు డేట్లు ఇచ్చింది. ప్రస్తుతం హిందీలో రెండు సినిమాల్లో నటిస్తోంది. 'ఆషీకీ' ఫ్రాంచైజీ నుంచి రిలీజ్ అవుతోన్న పార్ట్ 3లో నటిస్తోంది. అనురాగ్ బసు తెరకెక్కిస్తోన్న చిత్రమిది. ఇం దులో హీరోతో ఇంటిమేట్ సన్ని వేశాల్లోనూ అమ్మడు ఎక్కడా తగ్గలేదనే ప్రచారం బాలీవుడ్ మీడియాలో జరుగుతోంది. దీన్ని బట్టి శ్రీలీల పాత్ర డిమాండ్ చేసిందంటే? ఎందాకైనా వెళ్తుంది? పనిగట్టుకుని గ్లామర్ డాల్ ని చేద్దామంటే మాత్రం ససేమేరా అంటోంది అన్నది అర్దమవుతుంది.



చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లకు గ్రీన్ సిగ్నల్

ఆర్సీబీ అభిమానులకు గుడ్‌న్యూస్. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం లో ఐపీఎల్, అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించేందుకు అనుమతి లభించినట్లు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (KSCA) శనివారం ప్రకటించింది. "అంతర్జాతీయ, ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించడానికి కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్‌కు హోం శాఖ, కర్ణాటక ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని ప్రకటించడానికి మేం సంతోషిస్తున్నాం" అని కేఎస్‌సీఏ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రభుత్వం, సంబంధిత అధికారులు సూచించిన నిర్దిష్ట నిబంధనలు, షరతులకు అనుగుణంగా మ్యాచ్‌ల నిర్వహణ ఉంటుందని తెలిపింది.ఐపీఎల్ 2025లో ఆర్సీబీ ఛాంపియన్‌గా నిలవగా.. జూన్ 4న చిన్నస్వామి స్టేడియంలో సంబరాలు నిర్వహించారు. అప్పుడు స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందగా.. 50 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైకెల్ డి.కున్హా నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం జ్యుడిషియల్ కమిషన్ వేసింది. ఈ కమిషన్ చిన్నస్వామి స్టేడియం మ్యాచ్‌ల నిర్వహణకు సురక్షితం కాదని తేల్చింది. ఈ క్రమంలో కొన్ని షరతులతో మ్యాచ్‌లు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఐపీఎల్ 2026 సీజన్ మార్చి 26 నుంచి మొదలుకానుంది.



యూపీ ధమాకా

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో యూపీ వారియర్స్ వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. శనివారం జరిగిన డబుల్ హెడర్ తొలి పోరులో యూపీ వారియర్స్ 22 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌పై అద్భుత విజయం సాధించింది. గత మ్యాచ్‌లోనూ ముంబైని ఓడించిన యూపీ మరోమారు అదే సమష్టి ప్రదర్శన కనబరిచింది. ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో రెండు గెలిచిన యూపీ నాలుగు పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతుంటే ముంబై(4) రెండో స్థానంలో ఉంది. యూపీ నిర్దేశించిన 188 పరుగుల లక్ష్యఛేదనలో ముంబై 20 ఓవర్లలో 165/6 స్కోరు చేసింది.యూపీ కట్టుదిట్టమైన బౌలింగ్ ధాటికి ముంబై వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. వెటరన్ బౌలర్ శిఖాపాండే(2/30) మెరుగ్గా రాణించగా, క్రాంతిగౌడ్, ఎకల్‌స్టోన్, దీప్తిశర్మ, ట్రయాన్ ఒక్కో వికెట్ తీశారు. ఛేదనలో ముంబై ఘోరంగా తడబడింది. 69 పరుగులకే ఐదు వికెట్లు చేజార్చుకుని మ్యాచ్‌పై పట్టు కోల్పోయింది. సంజన(10), మాథ్యూస్(13), నాట్‌సీవర్(15), నికోలా క్యారీ(6), కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్(18) స్వల్ప స్కోర్లకే పరిమితమయ్యారు. లోయర్ మిడిలార్డర్‌లో అమెలియా కెర్(49 నాటౌట్), అమన్‌జ్యోత్‌కౌర్(41) పోరాడినా లాభం లేకపోయింది. వీరిద్దరు కలిసి ఆరో వికెట్‌కు 83 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే రన్‌రేట్ భారీగా ఉండటంతో ఒత్తిడికి లోనై వికెట్లు చేజార్చుకుంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200